ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



పెద్దపల్లి
జిల్లా వార్తలు
5★
మంగళవారం 17 డిసెంబరు 2024

న్యూస్ బాక్స్

సమస్యలను పరిష్కరించాలి

కమాన్‌పూర్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యలు పరిష్కరించాలని మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలోని కార్యాలయ అధికారికి బీఆర్‌ఎస్ నాయకులు సోమవారం వినతి పత్రం సమర్పించారు. మండల కేంద్రంలోని పిల్లిపల్లెకు వెళ్లే దారిలో నూతలగుంట వద్ద నిర్మించిన శ్మశాన వాటిక నిర్మాణ పనులు పూర్తి స్థాయిలో చేపట్టకపోవడంతో పందులకు అడ్డాగా మారిందన్నారు. దీనికి తోడు శ్మశాన వాటిక పక్కనే డంపింగ్ యార్డు ఉండటం మూలంగా తీవ్ర దుర్వాసన వెదజల్లుతోందని తెలిపారు. శ్మశాన వాటికలో పనులను పూర్తి చేసి ప్రజలకు ఉపయోగపడేలా తీర్చిదిద్దాలని వినతిపత్రంలో కోరారు. వినతి పత్రం సమర్పించిన వారిలో బీఆర్‌ఎస్ పార్టీ మండల కన్వీనర్ తాటికొండ శంకర్, బొమ్మగాని అనిల్‌గౌడ్, యూత్ ప్రెసిడెంట్ గుర్రం లక్ష్మీమల్లు, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్, నాయకులు తోట రాజ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

ఆటో యూనియన్ జేఏసీ ఉపాధ్యక్షుడిగా ఆనంద్

ఓదెల, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఆటో యూనియన్ జేఏసీ ఉపాధ్యక్షుడిగా మండలంలోని చానకొండకు చెందిన రంగు ఆనంద్‌గౌడ్ సోమవారం ఎన్నికయ్యారు. ఎన్నికకు సహకరించిన జిల్లా అధ్యక్షుడు మంద రవితోపాటు జిల్లా కమిటీకి ఆనంద్ కృతజ్ఞతలు తెలిపారు. ఆనంద్ ఎన్నికపై ఆటో డ్రైవర్స్ యూనియన్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

ఉద్యోగ, కార్మిక సంఘాలపై నజర్

- వారి కదలికలపై ఇంటెలిజెన్స్‌తో ఆరా తీస్తున్న సర్కార్
- సమస్యలపై మొదలైన ఆందోళనలు
- వారం రోజులుగా కేజీబీవీ టీచర్లు, సీఆర్‌పీల సమ్మె
- భోజన విరామం అనంతరం మోడల్ స్కూళ్ల టీచర్ల నిరసన
- ఎన్నికల వేళ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్



(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి కావడంతో ఎన్నికల సందర్భంగా ఆ పార్టీ ఇచ్చిన హామీలను గుర్తు చేస్తూ వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు, కార్మిక సంఘాలు, ఇతరత్రా సంఘాలకు చెందిన వారు ఆందోళన బాట పడుతున్నారు. ఒకరిని చూసి మరొకరు ఆందోళనలకు సిద్ధం అవుతుండడంతో వారి కదలికలపై ప్రభుత్వం ఇంటెలిజెన్స్ వర్గాల ఆరా తీస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే కస్తూర్బాగాంధీ బాలికల గురుకుల విద్యాలయాల్లో పనిచేస్తున్న సీఆర్‌టీలు, పీఆర్‌టీలు, ఇతర ఉద్యోగులు, సమగ్ర శిక్ష పరిధిలో మండల విద్యాశాఖ కార్యాలయాలు, క్లస్టర్ల పరిధిలో పనిచేస్తున్న సీఆర్‌పీలు వారం రోజులుగా తమ డిమాండ్లను పరిష్కరించాలని విధులు బహిష్కరించి జిల్లా కేంద్రంలో రిలే నిరాహార దీక్షలు చేస్తున్నారు. మోడల్ స్కూళ్లలో పనిచేస్తున్న టీచర్లు సైతం తమ సమస్యలను పరిష్కరించాలని మధ్యాహ్నభోజన సమయంలో నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇదే అదనుగా ఇంకా ఇతర సంఘాలకు చెందిన వారు ఎవరైనా ఆందోళనలకు దిగవచ్చని భావిస్తున్న ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, కుల సంఘాలు, ఇతర సంఘాలు నిర్వహించే సమావేశాలపై ఇంటిలిజెన్స్ వర్గాలు ఓ కన్నేసి ఉంచాయి. జిల్లాలో యాక్టివ్ సంఘాల జాబితాలతో పాటు వాటికి నాయకత్వం వహిస్తున్న వారి వివరాలను, ఆందోళన చేస్తున్న వారి వెనుక ఎవరున్నారు, రాజకీయ పార్టీలు ఉన్నాయా, ఇంకా ఎవరైన ఉన్నారా అనే వివరాలను సేకరిస్తున్నారు. అంతేగాకుండా వారి బ్యాక్ గ్రౌండ్ గురించి కూడా ఆరా తీస్తున్నారు.

గత ఏడాది నవంబరు నెలాఖరులో జరిగిన రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీ పథకాలతో పాటు, ఇతర పథకాలు, ఉద్యోగులు, కాంట్రాక్టు ఉద్యోగులు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, కార్మిక సంఘాలు, కుల సంఘాలు, ఇతర సంఘాల డిమాండ్లను పరిష్కరిస్తామని హామీ ఇచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం అప్పుల్లో కూరుకుపోయినా ఆరు గ్యారంటీ పథకాలకు సంబంధించి మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌక ర్యం, ఆరోగ్య శ్రీ పథకం ద్వారా 10లక్షల రూపాయల వరకు ఉచిత వైద్య సౌకర్యం, 200యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను అందించేందుకు గృహజ్యోతి పథకం, వంట గ్యాస్‌ను 500 రూపాయలకే అందిస్తున్నారు. రైతు భరోసాను వచ్చే సంక్రాంతి నుంచి అమలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధం అవుతున్నది. గడిచిన వానాకాలం సీజన్‌లో సన్న రకం ధాన్యం...

మిగతా 8లో

పెరిగిన చలి

- రామగుండంలో 10డిగ్రీలకు పడిపోయిన ఉష్ణోగ్రతలు

8

కళ్యాణ్‌నగర్/ మార్కండేయకాలనీ,(ఆంధ్రజ్యోతి)



రామగుండంలో చలి మంట కాగుతున్న స్థానికులు

వామ్మో.. కోతులు

- ఇళ్లపైకి గుంపులు గుంపులుగా..
- స్టేడియంలో వాకర్లపై దాడికి యత్నిస్తున్న వానరసైన్యం

8

కళ్యాణ్‌నగర్ (ఆంధ్రజ్యోతి)



సింగరేణి స్టేడియంలో కోతులు

రామగుండంలో క్వాలిటీ కంట్రోల్ అధికారుల తనిఖీ

- వివిధ డివిజన్లలో కోర్ కటింగ్‌లు
- పనుల నాణ్యతపై కాంట్రాక్టర్లకు సూచనలు
- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన



కోర్ కంటిగ్ చేసి కొలతలు చూస్తున్న క్వాలిటీ కంట్రోల్ అధికారులు

కోల్‌సిటీ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): 'అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపాలు' శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై ప్రజారోగ్యశాఖ ఇంజనీరింగ్ విభాగం ఉన్నతాధికారులు స్పందించారు. ఇంజనీరింగ్ చీఫ్ ఆదేశాల మేరకు సోమవారం రామగుండంలో ప్రజారోగ్యశాఖ క్వాలిటీ కంట్రోల్ విభాగం అధికారులు అభివృద్ధి పనులపై తనిఖీలు జరిపారు. క్వాలిటీ కంట్రోల్ ఈఈ(హైదరాబాద్) శ్రీధర్ ఆధ్వర్యంలో డీఈ రవికుమార్, ఏఈ ఆనంద్‌లు టీయూఎఫ్ఐడీసీ నిధులతో జరుగుతున్న అభివృద్ధి పనుల నాణ్యతను పరిశీలించారు. వివిధ డివిజన్లలో జరుగుతున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులు, మెటీరియల్, మంచినీటి పైప్‌లైన్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణాలు, ఇందిరానగర్, మార్కండేయకాలనీల్లోని ఓపెన్ డ్రైన్‌లను పరిశీలించారు. ఇప్పటికే వేసిన సీసీ రోడ్లకు కోర్ కటింగ్ తీశారు. దుర్గానగర్‌లో సీసీ రోడ్లలో పగుళ్లు ఇవ్వగా పరిశీలన జరిపారు. అభివృద్ధి పనుల నాణ్యత విషయంలో కాంట్రాక్టర్లకు సూచనలు చేశారు. టీయూఎఫ్ఐడీసీ పనులకు సంబంధించి ప్రజారోగ్యశాఖ క్వాలిటీ కంట్రోల్ విభాగమే నాణ్యతను పర్యవేక్షిస్తుంది. గతంలో థర్డ్ పార్టీ నాణ్యత ఏజెన్సీలకు ఇచ్చేవారు. దీనిపై ఆరోపణలు రావడంతో ఈసారి డిపార్ట్‌మెంటే క్వాలిటీని పర్యవేక్షిస్తోంది. పనులు జరిగే సమయంలో క్వాలిటీ కంట్రోల్ విభాగం అధికారులు పర్యవేక్షించాల్సి ఉండగా వారు అందుబాటులో ఉండకపోవడంతో నాణ్యత లోపిస్తుందనే విమర్శలున్నాయి. దీనికి తోడు రామగుండం నగరపాలక సంస్థ ఇంజనీర్లు కూడా పూర్తి స్థాయిలో దృష్టి పెట్టకపోవడంతో నాణ్యత లోపాలు బయట పడుతున్నాయి. వీరి వెంట నగరపాలక సంస్థ ఈఈ రామన్, డీఈ షాబాద్, ఏఈ మీర్ ఉన్నారు.

జిల్లా స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలు



టేబుల్ టెన్నిస్ కోర్టు వద్ద అతిథులు, విద్యార్థులు

సుల్తానాబాద్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): టేబుల్ టెన్నిస్ జిల్లాస్థాయి పోటీలను సుల్తానాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మీరాజమల్లు ప్రారంభించారు. శనివారం స్థానిక ఇండియన్ పబ్లిక్ స్కూల్‌లో నిర్వహించిన ఈ పోటీల్లో జిల్లాలోని పలు ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలలకు చెందిన వంద మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ గాజుల లక్ష్మీరాజమల్లు, టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కోడెం అజయ్ మాట్లాడుతు విద్యార్థులు ప్రాథమిక స్థాయి నుంచే చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని అన్నారు. జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభను చాటుకుని రాష్ట్రస్థాయికి ఎంపికైన పలువురు విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు ముస్త్యాల రవీందర్, స్కూల్ ప్రిన్సిపాల్ కృష్ణప్రియ, చైర్మన్ సంజీవ్ కుమార్, టేబుల్ టెన్నిస్ జిల్లా కార్యదర్శి బొల్లి సత్యనారాయణ, కోశాధికారి గోపికృష్ణ ఇక్బాల్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ అస్తిత్వాన్ని దెబ్బతీస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు

రామగిరి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ అస్తిత్వానికి కాంగ్రెస్ పార్టీ గొడ్డలిపెట్టుగా మారిందని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు అన్నారు. సోమవారం మండలంలోని సెంటినరీకాలనీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పోరాడి సాధించుకున్న తెలంగాణ అస్తిత్వాన్ని కాంగ్రెస్ సర్కార్ దెబ్బతీస్తోందన్నారు. సింగరేణి కార్మికులు జేఏసీగా ఏర్పడి మలిదశ తెలంగాణ ఉద్యమాన్ని నడిపించారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం సింగరేణి సంస్థను పూర్తిగా నిర్వీర్యం చేసి కార్మికులను మోసం చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలనపై దృష్టి పెట్టకుండా పేర్లు, రూపాలను మార్చడంపైనే దృష్టి సారిస్తోందని ఆరోపించారు. తెలంగాణ తల్లి రూపాన్ని మార్చడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. రామగిరిలో తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటు చేస్తామని ఇందుకు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత చేతుల మీదుగా శంకుస్థాపన చేయనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు శంకేషి రవీందర్, పూదరి సత్యనారాయణగౌడ్, గాజుల ప్రసాద్, దర్ముల రాజసంపత్, రొడ్డ శ్రీనివాస్, ఏగొలపు మల్లయ్యగౌడ్, మట్టరాజు, అనిల్, లక్ష్మణ్, చంటి, సాకేత్, కుమారస్వామి పాల్గొన్నారు.

హమాలీలకు యూనిఫామ్స్ అందజేత

ధర్మారం, డిసెంబర్ 16 (ఆంధ్రజ్యోతి): ధర్మారం వ్యవసాయ మార్కెట్‌లో పనిచేస్తున్న హమాలీలతో పాటు, చాట కూలీలుగా పనిచేస్తున్న మహిళలకు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ లావుడ్య రూప్లానాయక్ యూనిఫామ్స్ అందజేశారు. వ్యవసాయ మార్కెట్‌లో హమాలీలుగా 18 మంది, చాటకూలీలుగా 22 మంది, దడ్వాయిలుగా ముగ్గురు పని చేస్తున్నారు. సోమవారం మొత్తం 43 మందికి ప్రభుత్వం తరుపున రూప్లానాయక్ యూనిఫామ్‌లను అందజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ సెక్రెటరీ సరోజ, వైస్ చైర్మన్ అరిగే లింగయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి యోగా, బాడ్మింటన్ పోటీలకు ఎంపిక



రాష్ట్ర పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

మంథని, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): సీఎం కప్ రాష్ట్ర స్థాయి బాడ్మింటన్ పోటీలకు పెద్దపల్లి జిల్లా క్రీడాకారుల ఎంపిక పోటీలను స్థానిక ఫ్రెండ్స్ క్లబ్‌లో నిర్వహించినట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి సీఎం కప్ జిల్లా కమిటీ సభ్యుడు కొమురోజు శ్రీనివాస్ సోమవారం తెలిపారు. జిల్లా నుంచి ఈ పోటీలకు 50 మంది క్రీడాకారులు హాజరుకాగా అండర్-15 బాలుర, బాలికల విభాగాల్లో మోక్షినాథ్, పృధ్వీన్ గౌతమ్‌సాయి, విశ్వక్‌సేన, సాయిగణేశ్వర్, ఆరాధ్య కుస్వాన, వైష్ణవ్‌శ్రీ, లిఖిత, అభిగ్న, వర్నిక ఎంపికైనట్లు తెలిపారు. జూనియర్ యోగా అండర్-10, 18 విభాగంలో తేజశ్విని, వైష్ణవ్‌శ్రీ, అక్షిత ఎంపికైనట్లు తెలిపారు. వీరంతా రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. మంగళవారం రాష్ట్రస్థాయి అండర్-19 బాలికలకు బాడ్మింటన్ క్రీడాకారుల ఎంపిక జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో పీడీలు ఎ విజయ్‌కుమార్, ఎండీ జావీద్, ఎం సమ్మయ్య, ఎండీ ఖాజాబీ పాల్గొన్నారు.

క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలి

- డీఎంహెచ్‌వో అన్నా ప్రసన్నకుమారి

పాలకుర్తి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): 60 సంవత్సరాలు పైబడిన వారందరూ క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి(డీఎంహెచ్‌వో) అన్నా ప్రసన్నకుమారి అన్నారు. సోమవారం మండలం పరిధిలోని బసంత్‌నగర్ వడ్డెర కాలనీలో నిర్వహించిన నిక్షయ్ శిబిరాన్ని ఆకస్మికంగా సందర్శించారు. క్షయ వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న కార్యక్రమంలో క్షయ వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు తెమడ పరీక్షలను సమీక్షించారు. క్షయ వ్యాధి సోకిన వారి కుటుంబ సభ్యులు, పోషకాహార లోపం గలవారు, మధుమేహం కలవారు, హెచ్‌ఐవీ సోకిన వారు తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన గ్రూప్-2 పరీక్షలు



పెద్దపల్లిలో హాల్‌టికెట్ నంబర్లను చూసుకుంటున్న అభ్యర్థులు, పరీక్ష రాసి మంథని జేఎన్‌టీయూ నుంచి బయటకు వస్తున్న అభ్యర్థులు

- 48 శాతం అభ్యర్థుల హాజరు

పెద్దపల్లి కల్చరల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా 18 పరీక్ష కేంద్రాల్లో జరిగిన గ్రూప్-2 పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ముగిశాయి. ఉదయం మూడో పేపర్ 10 గంటలకు ప్రారంభమై 12.30 గంటల కు ముగిసింది. కాగా జిల్లావ్యాప్తంగా 9,018 అభ్యర్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా 4,349 అభ్యర్థులు హాజరు కాగా 4,669 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. అభ్యర్థుల హాజరు 48.22 శాతం నమోదైంది. మధ్యాహ్నం జరిగిన పేపర్-4 పరీక్షక 4,346 మంది అభ్యర్థులు హాజరుకాగా 4,672 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. 48.19 శాతం మంది హాజరయ్యారు. ఒక సెంటర్ వద్ద ఆలస్యంగా వచ్చిన అభ్యర్థిని అధికారులు తిప్పి పంపారు.

రామగిరి: జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం గ్రూప్-2 పరీక్షలు ముగిశాయి. రెండోరోజు సోమవారం జరిగిన పరీక్షలో 932 మంది అభ్యర్థులకు గాను 482 మంది హాజరు కాగా 450 మంది గైర్హాజరైనట్లు ప్రిన్స్‌పాల్ చెరుకు శ్రీధర్‌రెడ్డి తెలిపారు. అదనపు కలెక్టర్ అరుణశ్రీ పరీక్ష జరుగుతున్న తీరును పరిశీలించారు. అలాగే ప్రత్యేక పరిశీలకులు సురేష్ నిర్వహణను సమీక్షించారు. మంథని సీఐ రాజు, రామగిరి ఎస్ఐ చంద్రకుమార్, సిబ్బంది బందోబస్తును నిర్వహించారు.

కోల్‌సిటీటౌన్: గ్రూప్-2 పరీక్షలు గోదావరిఖనిలో ప్రశాంతంగా ముగిశాయి. మొత్తం నాలుగు పరీక్షా కేంద్రాల్లో అభ్యర్థులు పరీక్షలు రాశారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జెడ్పీ హైస్కూల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల (బాలికల), చైతన్య డిగ్రీ కళాశాల కేంద్రాల్లో అభ్యర్థులు పరీక్షలు రాశారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు. పరీక్షలు ప్రశాంతంగా ముగియడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

సెంటర్ ఒక చోట.. ఏర్పాట్లు మరో చోట

పెద్దపల్లిటౌన్ (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లిలో జిల్లాలో గ్రూప్-2 పరీక్ష కేంద్రంలో గందరగోళం నెలకొంది. అభ్యర్థులకు జారీ చేసిన హాల్‌టికెట్‌లో పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలోని బాలికల పాఠశాల అడ్రస్ ముద్రించి ఉంది. కానీ అధికారులు పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని గర్ల్స్ హైస్కూల్‌లో ఏర్పాట్లు చేశారు. శనివారం రాత్రి పొరపాటును గుర్తించిన అధికారులు రాత్రికిరాత్రి గోదావరిఖనిలో పరీక్షా కేంద్రంలో ఏర్పాట్లు చేశారు. ఆదివారం, సోమవారం యథావిధిగా పరీక్షన నిర్వహించారు.

● వెలుగులోకి వచ్చింది ఇలా..

గ్రూప్-2 పరీక్షలను 15, 16 తేదీల్లో టీజీపీఎస్సీ నిర్వహించింది. దీంతో ఓ అభ్యర్థి పరీక్షా కేంద్రాన్ని నిర్ధారించుకునేందుకు ఒక రోజు ముందే శనివారం గోదావరిఖనికి వెళ్లాడు. కానీ తన వివరాలు కనిపించలేదు. దీంతో అభ్యర్థి హాల్ టికెట్టు మీద ఉన్న టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వడంతో టీజీపీఎస్సీ అధికారులు గోదావరిఖనిలో పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.

ప్రజా వినతులను సత్వరమే పరిష్కరించాలి

- కలెక్టర్ కోయ శ్రీహర్ష



వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లిటౌన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో వచ్చిన వినతులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ కోయ శ్రీహర్ష అదనపు కలెక్టర్ డి వేణుతో కలిసి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఎలిగేడు మండలం లాలపల్లె గ్రామవాసి బోగ కనకమ్మ తన భర్త భూమయ్య గ్రామ రెవెన్యూ సహాయకుడిగా ఎలిగేడు మండలంలో పనిచేస్తూ 5 డిసెంబరు 2023న మరణించాడని, అతని గ్రాచ్యూటీ ఇన్సూరెన్స్ ఇంతవరకు రాలేదని దాన్ని త్వరగా చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ దరఖాస్తు చేసుకున్నారు. వెంటనే పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టరేట్ పరిపాలన అధికారికి కలెక్టర్ సూచించారు. గోదావరిఖని బాపూజీ నగర్‌కు చెందిన బోయిని ఓదెమ్మ తన భర్త 19 జూలై 2023 నాడు మరణించాడని, తనకు వితంతు పెన్షన్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకున్నారు. అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారిని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

● హాస్టల్స్‌లో మరమ్మతు చేపట్టాలి..

పెద్దపల్లి కల్చరల్ (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉన్న ఎస్సీ, బీసీ సంక్షేమ వసతి గృహాల వద్ద ప్రతిపాదించిన మరమ్మతు పనులు రెండు నెలల్లో పూర్తి చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. సోమవారం పంచాయతీరాజ్ ఇంజనీరింగ్‌పై కలెక్టర్ కోయ శ్రీహర్ష సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఉన్న 13 బీసి, 15 ఎస్సీ సంక్షేమ వసతి గృహాల్లో అవసరమైన మరమ్మతు పనులు, మౌలిక వసతుల కల్పన ప్రతిపాదనలు పరిశీలించి అవసరమైన నిధులు మంజూరు చేస్తామన్నారు. పనులు వెంటనే చేపట్టి రెండు నెలల వ్యవధిలో పూర్తి చేయాలని సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పెండింగ్‌లో ఉన్న కాంపౌండ్ వాల్, ఇతర చిన్నచిన్న పనుల ప్రతిపాదనలపై చర్చించిన కలెక్టర్ నిధులు మంజూరు చేస్తామని, పనులు సకాలంలో పూర్తయ్యేలా చూడాలని అధికారులకు తెలిపారు. గ్రామీణ పంచాయతీరాజ్ విభాగానికి సంబంధించి పురోగతి ఉన్న పనులు త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొని రావాలని అన్నారు. సమావేశంలో జిల్లా బీసీ అభివృద్ధి అధికారి రంగారెడ్డి, ఈఈ పంచాయతీరాజ్ గిరీష్‌బాబు, జిల్లా ముఖ్య ప్రణా ళిక అధికారి రవీందర్, జడ్పీ సీఈవో నరేందర్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి సైన్స్‌ఫెయిర్‌కు అల్ఫోర్స్ విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న నరేందర్‌రెడ్డి

సుల్తానాబాద్, డిసెంబరు 16: (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌లో సుల్తానాబాద్ అల్ఫోర్స్ విద్యార్థులు వై యోగేష్, గోపతి త్రిలోచన్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి తెలిపారు. గణిత శాస్త్రంలో తొమ్మిదో తరగతి విద్యార్థి యోగేష్ ప్రథమ స్థానంలో, సైన్స్ విభాగంలో గోపతి త్రిలోచన్ వర్మ ద్వితీయస్థానం సాధించారన్నారు. పాఠశాలలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులను అభినందించి మెమోంటోలు అందించారు.

నిరుద్యోగులకు అండగా..

- ఉచిత కోచింగ్ ఇస్తున్న ఎస్సీ స్టడీ సర్కిల్
- ప్రవేశ పరీక్ష ద్వారా అభ్యర్థుల ఎంపిక
- శిక్షణ సమయంలో అలవెన్స్‌లతోపాటు భోజన వసతి

గణేశ్‌నగర్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగాలకు ప్రస్తుత పరిస్థితుల్లో విపరీతమైన పోటీ ఉంది. ఉద్యోగాలు సాధించాలంటే పటిష్టమైన ప్రణాళికతోపాటు అన్ని విషయాలపై సమగ్రమైన అవగాహన ఉండాలి. అవసరమైన స్టడీ మెటీరియల్‌తోపాటు అనుభవజ్ఞుల మార్గదర్శకత్వం ఉంటే ఉద్యోగం సాధించవచ్చు. వీటన్నిటిని సమకూరుస్తోంది ఎస్సీ స్టడీ సర్కిల్. జాతీయ స్థాయిలో, రాష్ట్ర స్థాయిలో వెలువడే పలు నోటిఫికేషన్లకు అనుగుణంగా కోర్సులను రూపొందించి ఈ సంస్థ శిక్షణ ఇస్తోంది. ఒకప్పుడు ఈ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ ఇచ్చే ప్రైవేట్ సంస్థలు ఢిల్లీ, హైదరాబాద్ లాంటి పెద్ద నగరాల్లోనే ఉండేవి. ఫీజు వేలల్లో ఉండడంతోపాటు అక్కడికి వెళ్లి వసతి ఏర్పాట్లు చేసుకొని చదువుకోవడం ఖరీదైన వ్యవహారం. పేద నిరుద్యోగ యువతీ యువకులకు ఉచిత భోజన, వసతి సౌకర్యాలతో ప్రైవేట్ సంస్థలకు దీటుగా ప్రభుత్వ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వమే స్టడీ సర్కిల్‌లను ఏర్పాటు చేసింది. ఎస్సీ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో 2016 సంవత్సరంలో ఉమ్మడి జిల్లాకు సంబంధించి అంబేద్కర్ స్టడీ సర్కిల్ కరీంనగర్‌లో ఏర్పాటైంది. ఇప్పటి వరకు ఈ ఎస్సీ స్టడీ సర్కిల్‌లో శిక్షణ పొంది 269 మంది ఉద్యోగాలను సాధించారు.



ఎస్సీ స్టడీ సర్కిల్‌లో క్లాస్ వింటున్న విద్యార్థులు

● అర్హత:

ఎస్సీ స్టడీ సర్కిల్‌లో శిక్షణకు డిగ్రీ పాసై కుటుంబ వార్షిక ఆదాయం మూడు లక్షల రూపాయల లోపు ఉన్న ఉమ్మడి జిల్లాకు చెందిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ అభ్యర్థులు అర్హులు. ఇందులో ఎస్సీలకు 75 శాతం, బీసీలకు 15 శాతం, ఎస్టీలకు 10శాతం రిజర్వేషన్ ఉంటుంది. అభ్యర్థులు tsstudycircle.co.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ప్రవేశ పరీక్ష నిర్వహించి ఎంపికైన అభ్యర్థులకు శిక్షణను అందిస్తారు.

● వివిధ ప్రభుత్వ శాఖల్లో సాధించిన ఉద్యోగాలు

ఎస్సీ స్టడీ సర్కిల్ ద్వారా శిక్షణ తీసుకొని ఇప్పటి వరకు 269 మంది వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలను సాధించారు. బ్యాంకు ప్రొబేషనరీ ఆఫీసర్/మేనేజర్/క్లర్క్-11, సబ్ ఇన్‌స్పెక్టర్/పోలీస్ కానిస్టేబుల్స్-91, ప్రభుత్వ ఉపాధ్యాయులు/డిగ్రీ, జూనియర్ కాలేజీ లెక్చరర్స్-45, జూనియర్ పంచాయతీ కార్యదర్శులు-55, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్-6, జూనియర్ అకౌంట్ ఆఫీసర్స్-2, గ్రూప్-4లో-17, క్లర్క్ ఉద్యోగాలు-8, రైల్వే/స్టాఫ్ సెలక్షన్ కమిషన్/ఇతర విభాగాల్లో 34 మంది ఉద్యోగాలు సాధించారు.



ఎస్సీ స్టడీ సర్కిల్‌లో క్లాస్ చెబుతున్న అధ్యాపకుడు

నిపుణులతో బోధన

ఒక బ్యాచ్‌కు గరిష్ఠంగా 100 మందికి ఐదు నెలల వ్యవధిలో ఫౌండేషన్ కోర్సులో భోజన వసతులతో కూడిన శిక్షణ ఇస్తారు. అన్ని ప్రభుత్వ ఉద్యోగాలకు సంబంధించి జనరల్ స్టడీస్, కరెంట్ అఫైర్స్, జనరల్ యాప్టిట్యూడ్, ఇంగ్లీష్ తదితర సబ్జెక్టులను నిష్ణాతులైన అధ్యాపకులు బోధిస్తారు. వీటితోపాటు రోజువారీ పరీక్షలు నిర్వహిస్తారు. ప్రభుత్వ ఉన్నతాధికారులతో విద్యార్థులకు ప్రేరణ తరగతులను నిర్వహిస్తారు. శిక్షణతోపాటు పుస్తకాల కొనుగోలుకు 2,500 రూపాయలతోపాటు వ్యక్తిగత అవసరాల కోసం నెలకు అమ్మాయిలకు 150, అబ్బాయిలకు 100 రూపాయలు చెల్లిస్తారు.

నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలి

-బండ శ్రీనివాస్, డైరెక్టర్, ఎస్సీ స్టడీ సర్కిల్



నిరుద్యోగులకు అన్ని పోటీ పరీక్షలపై అవగాహన కలిగిస్తూ ఉద్యోగాలు సాధించే దిశగా కృషి చేస్తున్నాం. వివిధ స్థాయిల్లో ఉన్న ప్రభుత్వ అధికారులను స్టడీ సర్కిల్‌కు ఆహ్వానించి విద్యార్థులకు సూచనలు ఇప్పించి ప్రేరణ కలిగిస్తున్నాం. ఆడియో, వీడియో బోధన పద్ధతుల ద్వారా నిష్ణాతులతో వివిధ అంశాలను వివరిస్తున్నాం. పోటీ పరీక్షలకు సంబంధించి మాదిరి పరీక్షలను నిర్వహించి అభ్యర్థుల సామర్థ్యాన్ని మెరుగుపరుస్తున్నాం.

కోచింగ్ ఉపయోగపడింది

- కుమారస్వామి, గ్రూప్-4 ఉద్యోగి



నేను గ్రూప్-4 ఉద్యోగం సాధించడానికి స్టడీ సర్కిల్ కోచింగ్ చాలా ఉపయోగపడింది. పట్టణాలకు వెళ్లి డబ్బులు చెల్లించి కోచింగ్ తీసుకునే స్తోమత లేని వారికి స్టడీ సర్కిల్ ఓ వరం. కోచింగ్‌లో ఐదు నెలల సమయాన్ని సద్వినియోగం చేసుకొని ఉద్యోగాన్ని సాధించా. నిష్ణాతులతో కోచింగ్ ఇవ్వడంతో పుస్తకాలు, భోజన వసతి కల్పించారు.

స్టడీ సర్కిల్ ద్వారా కల సాకారమైంది

-తేజస్వి, ఎస్‌బీఐ ప్రొబేషనరీ ఆఫీసర్



ఉద్యోగాన్ని సాధించాలనే నా కల స్టడీ సర్కిల్ ద్వారా సాకారమైంది. నిపుణుల శిక్షణ, మెటీరియల్ ఉద్యోగ సాధనకు ఎంతో ఉపయోగపడింది. బలహీన వర్గాల విద్యార్థులకు ఇది ఒక వరం. స్టడీ సర్కిల్‌లో చేరిన తర్వాత ఎస్‌బీఐలో ప్రొబేషనరీ ఆఫీసర్ ప్రిలిమినరీ పరీక్ష పాసయ్యాను. తర్వాత మెయిన్స్, ఇంటర్వ్యూ పూర్తి చేసుకొని స్టడీ సర్కిల్‌లో ఉండగానే బ్యాంక్ ఆఫీసర్‌గా ఉద్యోగం సాధించా. స్టడీ సర్కిల్ వాతావరణం నాకెంతో ప్రోత్సాహాన్ని అందించింది.

దుబాయిలో బస్సు ప్రమాదం

దమ్మన్నపేట వాసి మృతి



ఎర్రయ్య (ఫైల్)

మేడిపల్లి, డిసెంబర్ 16(ఆంధ్రజ్యోతి): దుబాయిలో ఆదివారం రాత్రి జరిగిన బస్సు ప్రమాదంలో జగిత్యాల జిల్లా దమ్మన్నపేట గ్రామానికి చెందిన షేర్ ఎర్రన్న(50) మృతి చెందాడు. అదే గ్రామానికి చెందిన గాజుల గంగరాజంకు గాయాలైనట్లు కుటుంబీకులకు సమాచారం అందింది. వీరు ఇద్దరు పదేళ్ల క్రితం దుబాయిలో ఓ నిర్మాణ కంపనీలో కార్మికులుగా చేరారు. ఏడాదికి ఓసారి స్వగ్రామానికి వస్తూ పోతున్నారు. ఆదివారం వీరికి జీతాలు రావడంతో దర్వీస్ కంపెనీలో పని చేస్తున్న కార్మికులు దాదాపు 80 మంది వారుంటున్న ప్రాంతంలో డబ్బులను ఇంటికి పంపించే సౌకర్యం లేకపోవడంతో పాటు, నిత్యావసరాల కొనుగోలు కోసం కంపెనీ బస్సులో అందరూ కలిసి అజ్మాన్ అనే ప్రాంతానికి వచ్చి తిరుగు ప్రయాణం అయ్యారు. బస్సు ఘాటు రోడ్డు పైనుంచి లోయలో పడింది. ఈ ప్రమాదంలో ఎర్రన్నకు తీవ్ర గాయాలై ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. గంగరాజంకు గాయాలు కావడంతో ఆక్కడే ఆస్పత్రికి తరలించారు.

భూ తగాదాలతో ఘర్షణ

● ఒకరికి గాయాలు

ధర్మారం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) కొంత కాలంగా ఓ కుటుంబంలో ఉన్న భూముల గొడవ చివరకు అన్నదమ్ముల మధ్య ఘర్షణకు దారి తీసింది. మండలంలోని రామయ్యపల్లి గ్రామానికి చెందిన మార్క శంకరయ్య, మార్క లింగయ్య అన్నదమ్ముల మధ్య కొంత కాలంగా భూ తగాదాలు ఉన్నాయి. వారి తండ్రి మార్క మల్లయ్య పేరు మీద ఉన్న ఇల్లుకు సంబంధించి స్థలాన్ని అన్న శంకరయ్యకు తెలియకుండా తమ్ముడు లింగయ్య తన బిడ్డ పేరు మీద రిజిష్ట్రేషన్ చేయించుకున్నట్లు తెలుస్తోంది. ఇదే విషయంలో అన్నదమ్ముల ఇద్దరి మధ్య మనస్పర్థలు ఉండగా సోమవారం పొలం వద్ద గట్ల విషయంలో లింగయ్యకు శంకరయ్య కుమారుడికి గొడవ జరిగి శంకరయ్య కుమారుడిపై లింగయ్య చేయిచేసుకున్నాడు. గొడవ అనంతరం శంకరయ్య కొడుకు ఇంటికి వచ్చి తండ్రికి చెప్పగా, కోపోద్రేకుడైన శంకరయ్య అతని కుమారుడితో కలిసి లింగయ్యపై కర్రలతో దాడి చేశారు. ఈ దాడిలో లింగయ్యకు తీవ్రగాయాలు కాగా చికిత్స నిమిత్తం 108 వాహనంలో కరీంనగర్ తరలించారు. కాగా తన తండ్రిని చంపాలనే ఉద్దేశంతోనే ఇద్దరు కలిసి కట్టెలతో కొట్టి తీవ్రంగా గాయపరచారని లింగయ్య కుమారుడు మార్క అజయ్ ధర్మారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అజయ్ పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఎండీ సాబీర్ తెలిపారు.

18న వర్గీకరణపై బహిరంగ విచారణ

జగిత్యాల అగ్రికల్చర్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిషన్ ఈ నెల 18 బుధవారం రోజున ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు బహిరంగ విచారణ ఉంటుందని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి రాజ్‌కుమార్ తెలిపారు. షెడ్యూల్డు కులాల ప్రతినిధుల నుంచి ఉపకులాల వర్గీకరణ అంశంపై కరీంనగర్ కలెక్టర్ కార్యాలయంలో కమిషన్ చైర్మన్ జస్టిస్ డా.శమీం అక్తర్ వినతులు స్వీకరిస్తారని తెలిపారు. షెడ్యూల్డ్ కులాల ప్రతినిధులు గమనించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

కరీంనగర్ క్రైం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం నగునూర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆరెపల్లికి చెందిన కోనేరు రవి(22) అనే యువకుడు తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడని కరీంనగర్ రూరల్ పోలీసులు తెలిపారు. రవి చొప్పదండిలో వెల్డింగ్ పనిచేస్తూ ప్రతి రోజు ఆరెపల్లి నుంచి ఉదయం వెళ్లి సాయంత్రం ఇంటికి బైక్‌పై వస్తుంటాడని కుటుంబ సభ్యులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం చొప్పదండి నుంచి ఆరెపల్లికి వస్తుండగా నగునూర్ వద్ద ట్రాక్టర్ ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయని తెలిపారు. స్థానికుల సహాయంతో రవిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా మృతి చెందాడని పోలీసులు తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో ట్రాక్టర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

ఇటుకబట్టీ కార్మికుడి అనుమానాస్పద మృతి

కరీంనగర్ క్రైం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం మొగ్ధుంపూర్ వద్ద ఇటుకబట్టీలో కార్మికుడిగా పనిచేస్తున్న ఒడిశాకు చెందిన భగవాన్ జన్‌కర్(40) సోమవారం ఉదయం వైన్‌షాపు వెనుక వైపు అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. ఆదివారం సాయంత్రం వరకు ఇటుక బట్టీ వద్దనే ఉండి ఆ తరువాత ఇంటికి వెళ్లిన భగవాన్ జన్‌కర్ సోమవారం ఉదయం వైన్‌షాపు వద్దకు వెళ్లాడు. అక్కడ జన్‌కర్ మృతిచెంది ఉండడాన్ని మద్యం షాపులో పనిచేసే వారు గుర్తించి మృతుడి సోదరుడికి సమాచారం అందించారు. మృతుడి ముక్కు, ముఖంపై గాయాలున్నాయని పోలీసులు పేర్కొన్నారు. భగవాన్ జన్‌కర్ భార్య పిల్లలు ఒడిశాలోనే ఉంటుండగా అతను ఒక్కడే ముగ్ధుంపూర్‌లో నివాసం ఉంటూ ఇటుకబట్టీలో పనిచేస్తున్నాడు. మృతుడి సోదరుడు దురుబల్ జన్‌కర్ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

భార్య మృతి కేసులో భర్తకు 10 ఏళ్ల జైలు శిక్ష

సిరిసిల్ల క్రైం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): భార్య మృతికి కారణమైన గంభీరావుపేట మండల కేంద్రానికి చెందిన భర్త కడారి రాజశేఖర్ (35)కు పదేళ్ల జైలు శిక్షతోపాటు రూ.10 వేల జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎన్.ప్రేమలత సోమవారం తీర్పు వెల్లడించినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. గంభీరావుపేటకు చెదిన రాజశేఖర్ తన భార్య భాగ్యను అనుమానంతో డిసెంబరు 2, 2020న కొట్టాడు. ఆ దెబ్బలకు తాళలేక భాగ్య ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. ఈ సంఘటనపై అప్పటి ఎల్లారెడ్డిపేట సీఐ బన్సీలాల్ కేసు నమోదు చేసి రాజశేఖర్‌ను రిమాండ్‌కు తరలించి కోర్టులో చార్జీ షీట్ దాఖలు చేశారు. పరిశీలించిన న్యాయమూర్తి నిందితుడిపై నేరం రుజువు కావడంతో పదేళ్ల జైలు శిక్ష, రూ.10వేల జరిమానా విధించారు. శిక్షపడడంలో కృషి చేసిన డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, అప్పటి సీఐ బన్సీలాల్, సీఐ శ్రీనివాస్, ఎస్ఐ శ్రీకాంత్‌ను ఎస్పీ అభినందించారు.

ఇద్దరు యువకుల ఆత్మహత్య



దుర్గాప్రసాద్(ఫైల్)

జూలపల్లి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వడుకాపూర్ గ్రామానికి చెందిన ఆసంపెల్లి దుర్గాప్రసాద్(19) అనే విద్యార్థి తన ఇంట్లో ఉరివేసుకుని మృతి చెందాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆసంపెల్లి పోచయ్య-విజయ దంపతుల మొదటి కుమారుడైన దుర్గప్రసాద్ కరీంనగర్‌లో హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సు చేస్తున్నాడు. ఆదివారం రాత్రి తన ఇంటి సమీపంలోని రేకుల షెడ్డులో చీరెతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని విద్యార్థి మృతిపై ఆరా తీశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. కాగా ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

అనారోగ్య సమస్యతో..

యైటింక్లయిన్‌కాలనీ, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): రామగిరి మండలం పెద్దంపేట గ్రామానికి చెందిన కర్రు సతీష్(38) అనే యువకుడు ఆదివారం రాత్రి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైద్రాబాద్‌లోని లిక్కర్ గోదాంలో పనిచేస్తున్న సతీష్, మూడు నెలల క్రితం ఉద్యోగం మానేసి పెద్దంపేటలో తల్లిదండ్రుల వద్ద ఉంటున్నాడు. మద్యానికి బానిసైన సతీష్ కాలేయం దెబ్బతిని తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడు. సతీష్ తీరుతో మనస్తాపానికి గురై భార్య పుట్టింటికి వెళ్లింది. అనారోగ్య సమస్యలతో మానసికంగా కుంగిపోయాడు. ఆదివారం సాయంత్రం హైద్రాబాద్‌కు వెళ్తున్నట్టు ఇంట్లో చెప్పి బయటకు వెళ్లాడు. గ్రామ శివారులో చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

దొంగ అరెస్టు

గంభీరావుపేట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండలం లింగన్నపేట వైన్స్ కేసులో అంతర్రాష్ట్ర దొంగను స్థానిక పోలీస్‌లు అరెస్టు చేశారు. రెండు నెలల కిందట లింగన్నపేట శివారులోని రేణుక వైన్స్‌లో దొంగలు పడి రూ.10 వేల నగదు, ఫుల్ బాటిళ్లు ఎత్తుకెళ్లారు. ఈ కేసులో ఏ1 నర్సింలును అక్టోబరు 10న రిమాండ్‌కు తరలించారు. ఏ2 బీరప్ప హరీష్ అనే దొంగను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

సొంత గ్రామంలో ఆదరణ కరువు

పిచ్చి మొక్కల మధ్య సినారె విగ్రహం



హన్మాజీపేటలో సినారె విగ్రహం చుట్టూ పెరిగిన పిచ్చి మొక్కలు

వేములవాడ రూరల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జ్ఞానపీఠ అవార్డు గ్రహీత, సాహితీవేత్త సింగిరెడ్డి నారాయణరెడ్డి విగ్రహం చుట్టూ పిచ్చి మొక్కలు దర్శనమిస్తున్నా పట్టించుకునేవారు కరువయ్యారు. సినారె స్వస్థలం హన్మాజీపేటలో ఏర్పాటు చేసిన విగ్రహం చుట్టూ పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగినా పట్టించుకోవడం లేదు. విగ్రహం వద్దకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. మొక్కల తొలగింపుపై ఎవరూ పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

స్కూటీ దగ్ధం



దగ్ధమైన స్కూటీ

వీణవంక, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వల్భాపూర్ బస్టాండ్ వద్ద సోమవారం స్కూటీ దగ్ధమైంది. ఈ ఘటన ప్రమాదవశాత్తు జరిగిందా లేక ఆకతాయిలు ఎవరైనా చేశారా అనేది తెలియాల్సి ఉంది. వాహనం ఎవరిది అనే వివరాలు కూడా తెలియాల్సి ఉంది పంచాయతీ కార్యదర్శి కొండ అశోక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

అక్రమంగా బియ్యం తరలింపు

● లారీని పట్టుకున్న గ్రామస్థులు

ఓదెల, డిసెంబర్ 16 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ మండలం కాట్నపల్లిలోని ఒక రైస్ మిల్ నుంచి సుద్దాలలో గల స్టేజ్ వన్ సివిల్ సప్లై కార్పోరేషన్ గోదాంకు వెళ్లాల్సిన బియ్యం లారీని దారి మళ్లించడంతో అనుమానంతో నాంసానిపల్లి గ్రామస్థులు పట్టుకుని అధికారులకు సమాచారం అందించారు. సోమవారం రాత్రి లారీ నంబర్ ఏపీ 29 టీఏ 4420 గల దానిలో 290 క్వింటాళ్ల బియ్యం లోడ్‌తో సుద్దాలలో గల పౌరసరఫరాల సంస్థ స్టేజి వన్ గోదాంనకు బియ్యాన్ని తరలించారు. ఆ బియ్యం స్టేజి-2 ద్వారా రేషన్ షాపులకు సరఫరా కావాల్సి ఉంది. అయితే ఈ బియ్యం లోడుతో ఉన్న లారీ సుద్దాలకు వెళ్లకుండా ఓదెల మండలం నాంసానిపల్లి మీదుగా ఆ మండలంలో గల ఓ రైస్ మిల్లుకు వెళుతున్నట్లు సమాచారం అందింది.



పట్టుబడిన బియ్యం లారీ

బియ్యం లారీ నాంసానిపల్లి మీదుగా వెళ్తుండడాన్ని గమనించిన హరిపురం, ఓదెలకు చెందిన ఇద్దరు యువకులు రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నారనే అనుమానంతో లారీని నిలిపివేసి స్థానిక రెవెన్యూ అధికారులతో పాటు, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారికి సమాచారం ఇవ్వడంతో వారు తమ బృందంతో అక్కడికి చేరుకుని లారీలో ఉన్న బియ్యాన్ని పరిశీలించారు. అలాగే లారీ డ్రైవర్ వద్ద ఉన్న వేబిల్లును కూడా పరిశీలించారు. లారీలో ఉన్న బియ్యం శాంపిల్స్ తీసి ఆ లారీని పొత్కపల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ లారీ మండలంలోని ఓదెల, కొమిర శివారులోని ఒక రైస్ మిల్లుకు తరులుతున్నట్లు సమాచారం. సదరు మిల్లు యజమాని ఆ బియ్యాన్ని సీఎంఆర్ కింద పెట్టేందుకే అక్కడికి ఆ బియ్యంను తరలిస్తున్నట్లు సమాచారం. లారీలో ఉన్న బియ్యం శాంపిల్స్ సేకరించి పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్టు జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో గొర్రెల మృత్యువాత

మల్లాపూర్, డిసెంబరు, 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మొగిలిపేట గ్రామానికి చెందిన కొత్తముక్కెర రాజన్నకు చెందిన గొర్రెలు సోమవారం అనుమానాస్పదంగా మృత్యువాత పడ్డాయి. రోజు మాదిరిగానే రాజన్న తన గొర్రెల మందను మేపేందుకు సోమవారం గ్రామ శివారులోని రైస్ మిల్లు ప్రాంతానికి తీసుకెళ్లాడు. సమీపంలో మేతమేసిన గొర్రెలలో11 మృత్యువాత పడగా మరో 25 గొర్రెలు అస్వస్థతకు గురయ్యాయి. వెంటనే గమనించిన రాజన్న అపస్మారక స్థితికి గురైన వాటికి వైద్యం చేయించాడు. మృత్యువాత పడ్డ గొర్రెలను పోస్టుమార్టం కోసం పశువైద్యశాలకు తరలించారు. పోస్టుమార్టం చేస్తేగాని గొర్రెల మృతికి గల కారణాలు తెలుస్తాయని వైద్యులు తెలిపారు. గొర్రెలు మృతి చెందడంతో రెండు లక్షల రూపాయలు నష్టం వాటిల్లిందని రాజన్న ఆవేదన వ్యక్తం చేస్తూ ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.



గొర్రెలను ఢీకొట్టి దగ్ధమవుతున్న ద్విచక్రవాహనం

గొర్రెలను ఢీకొట్టి ద్విచక్రవాహనం దగ్ధం

వెల్గటూర్ : మండలంలోని స్తంభంపల్లి స్టేజి సమీపంలో గొర్ల మంద పైకి ద్విచక్ర వాహనం దూసుకెళ్లిన సంఘటనలో ఐదు గొర్రెలు మృతి చెందగా ద్వాచక్ర వాహనం పూర్తిగా దగ్ధమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రాంనూర్‌కు చెందిన ఐతె రాము రాయపట్నం వైపు నుంచి ఇంటికి ద్విచక్ర వాహనంపై వస్తున్న క్రమంలో రోడ్డుపై వెళ్లుతున్న గొర్ల మందను అతి వేగంగా ఢీకొట్టాడు. ఈ సంఘటనలో ఆరు గొర్రెలు మృతి చెందాయి. ద్విచక్రవాహనం అతి వేగంగా రోడ్డుపై పడడంతో మంటలు చెలరేగి వాహనం పూర్తిగా దగ్ధమైంది. వాహనదారుడు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు.

ఏసీబీకి చిక్కిన అటవీశాఖాధికారి

● రూ. 4,500 లంచం తీసుకుంటుండగా పట్టివేత

మెట్‌పల్లి టౌన్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి) : జగిత్యాల జిల్లా మెట్‌పల్లి పట్టణంలో సోమవారం ఏసీబీ అధికారుల వలలో అటవీ శాఖ డిప్యూటీ రేంజ్ అధికారి అఫీసొద్దీన్ చిక్కాడు. మామిడి రైతు నుంచి రూ.4,500 లంచం తీసుకుంటుండగా అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా, గంభీరావుపేట మండలం గజసింగవరం గ్రామానికి చెందిన పల్లాపు నరేష్‌కు కథలాపూర్ మండలం ఇప్పపల్లి గ్రామంలో మామిడి చెట్లు ఉన్నాయి. వారం రోజుల క్రితం 4 మామిడి చెట్లను నరికి వాటిని తరలించేందుకు అనుమతి ఇవ్వాల్సిందిగా నరేష్ అటవీ శాఖాధికారి అఫీసొద్దీన్‌ను సంప్రదించగా రూ. 10 వేల లంచం ఇవ్వాలని డిమాండ్ చేశాడు. దీంతో బాధితుడు చేసేది లేక రూ.5 వేలు ఇచ్చి రవాణాకు అనుమతి తీసుకున్నాడు. మళ్లీ రెండోసారి కొన్ని చెట్లను నరికి తరలించేందుకు అనుమతి ఇవ్వాలని సోమవారం సదరు అధికారిని కలువగా మళ్లీ రూ.4500 డిమాండ్ చేయడంతో బాధితుడు ఇస్తానని ఒప్పుకున్నాడు. అనంతరం ఏసీబీ డీఎస్పీ రమణమూర్తికి ఫిర్యాదు చేయడంతో ఏసీబీ అధికారుల సూచన మేరకు సోమవారం సాయంత్రం అఫీసొద్దీన్ అద్దె ఇంటి వద్ద బాధితుడు 4,500 లంచం ఇస్తుండగా అక్కడే ఉన్న అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. కేసు నమోదు చేసి జైలుకు పంపారు. ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.



ఏసీబీకి పట్టుబడ్డ అటవీ శాఖ డిప్యూటీ రేంజ్ అధికారి

24 గంటల్లో చోరీ కేసు ఛేదించిన పోలీసులు

గంభీరావుపేట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) దొంగతనం కేసును 24 గంటల్లో గంభీరావుపేట పోలీసులు ఛేదించారు. వివరాలు ఇలా ఉన్నాయి.. బీబీపేట మండలం కోనాపూర్ గ్రామానికి చెందిన బీరయ్య నాలుగు రోజుల క్రిందట తన కూతురు వద్దకు వెళ్లి 15న తిరిగి వచ్చే క్రమంలో మాచారెడ్డి వద్ద దిగాడు. గంభీరావుపేట మండలం దమ్మన్నపేట గ్రామానికి చెందిన దుండుగుల సాయిలు అనే వ్యక్తి బీరయ్య వద్దకు వచ్చి తన భార్యకు ఆరోగ్యం బాగాలేదని, అడవిలో పెరిగే మోతుకు ఊడుగు చెట్ల వేర్లు కావాలని నమ్మించారు. వేరే వాళ్ల చేతితో వేర్లు తెంపితే పనిచేస్తుందని నమ్మబలికి సమీప పెద్దమ్మ అడవిలోకి బీరయ్యను తీసుకెళ్లాడు. పెద్దమ్మ అడవిలో ఉన్న మోతుకు, ఊడుగు చెట్ల వద్దకు వెళ్లాక వేర్లు తెచ్చేటప్పుడు ఒంటిపై ఎలాంటి బంగారు. వెండి వస్తువులు ఉండరాదని బీరయ్యకు చెందిన బంగారం చెవిపోగులు, వెండి కడియాలను బలవంతంగా తీసేయించాడు. బీరయ్య చెట్ల వేర్లను తీస్తుండగా, బీరయ్యకు చెందిన బంగారు చెవి పోగులు, వెండి కడియాలను సాయిలు ఎత్తుకుని పారి పోయాడు. సంఘటనపై పోలీసులకు బాధితుడు బీరయ్య పిర్యాదు చేయడంతో చాక చక్యంగా గాలింపు చర్యలను చేపట్టి 24 గంటల వ్యవదిలో సాయిలును పట్టుకుని చెవి పోగులు, కడియాలు రికవరి చేశారు. స్థానిక ఎస్ఐ శ్రీకాంత్ పోలీస్ సిబ్బంది సహకారంతో నేరస్తుడైన సాయిలు 24 గంటల్లో పట్టుకోడవంతో ఉన్నతాధికారులు అబినందించారు.



పోలీసులు రికవరీ చేసిన బంగారం చెవి పోగులు, వెండి కడియాలు

వసూళ్లకు పాల్పడిన వ్యక్తిపై కేసు

యైటింక్లయిన్‌కాలనీ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ పథకం పేరిట మహిళల నుంచి నగదు వసూలు చేసిన ధరావత్ రాజేష్‌నాయక్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు గోదావరిఖని టూటౌన్ సీఐ ప్రసాదరావు సోమవారం తెలిపారు. పీఎంఈజీ (ప్రైమ్ మినిస్టర్ ఎంప్లాయ్‌మెంట్ జనరేషన్ ప్రోగ్రాం) పథకంలో భాగంగా స్థానిక సదానంద థియేటర్ బిల్డింగ్‌ను రాజేష్ నాయక్ అద్దెకు తీసుకున్నాడు. అన్నపూర్ణ ఫుడ్స్ పేరుతో కేంద్ర ప్రభుత్వ పథకమైన పీఎంఈజీ సభ్యత్వం పేరిట మహిళల వద్ద రూ. 2,600 నుంచి 5,200 వరకు వసూలు చేసినట్టు సీఐ తెలిపారు. ఐడీ కార్డు, ట్రైనింగ్ ఫీజు, యూనిఫాం పేరిట వసూలు చేసినట్టు తెలిపారు. హనమాన్ నగర్‌కు చెందిన భాగ్యలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాజేష్‌నాయక్‌పై కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు.

జాతీయస్థాయి యోగా పోటీలకు ఎంపిక


జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు 16: జాతీయస్థాయి అండర్-14 ఎస్‌జీఎఫ్ యోగాసన పోటీలకు జిల్లాకు చెందిన ముగ్గురు క్రీడాకారులు ఎంపికయ్యారు. కోయంబత్తూర్‌లో ఈ నెల 16 నుంచి 20వ తేదీ వరకు జరిగే జాతీయస్థాయి యోగాసన పోటీలకు కరీంనగర్ జిల్లా దేవంపల్లి గురుకుల పాఠశాల విద్యార్థులు తిట్ల హర్షిత్ బాలాజీ, పురాణం దీపక్, జుట్టు అశ్విత్ ఎంపికయ్యారు. వీరితో పాటు జిల్లాకు చెందిన పి.రామకృష్ణ రాష్ట్ర జట్టుకు కోచ్‌గా, అనిల్ కుమార్ రాష్ట్ర జట్టుకు మేనేజర్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులను, కోచ్, మేనేజర్లను జిల్లా విద్యాశాఖాధికారి సీహెచ్‌వి జనార్దన్ రావు, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ గోలి జగన్నాథం, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి బి వేణుగోపాల్, జిల్లా యోగా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి సిద్ధారెడ్డి అభినందించారు.

మానకొండూర్ పాఠశాలను తనిఖీ చేసిన ఆర్జేడీ


విద్యార్థులతో మాట్లాడుతున్న ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి

మానకొండూర్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మానకొండూర్‌లోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలను విద్యాశాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ కే. సత్యనారాయణరెడ్డి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో కొనసాగుతున్న పదవతరగతి స్టడీ అవర్స్‌ను పరిశీలించి పూర్తి అయిన సిలబస్‌పై ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. తరగతుల గురించి విద్యార్థులతో మాట్లాడారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి ఎం. మధుసూదనాచారి, ప్రధానోపాధ్యాయులు డి. శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

యూట్యూబ్... నటనపై కాస్తో కూస్తో ఆసక్తి ఉన్న వారికి ఇదొక మంచి వేదిక. లక్షల్లో పెట్టుబడులు పెట్టి తీసే చిత్రాలకన్నా చిన్న పాటి పెట్టుబడితో మారుమూల గ్రామాల్లో ఎంతో మంది షార్ట్ ఫిలిమ్స్ తీస్తూ పేరు తెచ్చుకుంటున్నారు. అంతే కాకుండా ఆర్థికంగా స్థిరపడుతున్నారు. మల్యాల మండలం లంబాడిపల్లికి చెందిన మిల్కూరి అంజయ్య ఉరఫ్ అంజిమామ కూడా తన నటనతో ఎంతో మందిని మెప్పించి అతి తక్కువ సమయంలోనే తనకంటూ గుర్తింపు తెచ్చుకున్నాడు. మొదట గ్రామంలో చిన్న చిన్న షోలలో నటించే అంజి ఇటీవల నవంబర్‌లో సొంతంగా చానల్ ప్రారంభించాడు. తాను తీస్తున్న షోలను అందులోనే అప్‌లోడ్ చేస్తున్నాడు. కేవలం రెండు నెలల్లోనే తన చానల్‌కు 50వేల మంది సబ్‌స్క్రైబర్స్ అయ్యారు.







45 రోజులు.. 50 వేల సబ్‌స్క్రైబర్స్

- యూట్యూబ్, సినిమాల్లో రాణిస్తున్న అంజిమామ
- 700లకు పైగా వీడియోలు..
- నటనా ఆసక్తి గల యువతకు ప్రోత్సాహం

మల్యాల, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): 45 రోజులు..50 వేల మంది సబ్‌స్క్రైబర్స్. ఇదీ అంజిమామ చానల్‌కు ఉన్న ప్రత్యేకత. యూట్యూబ్ చానల్ ప్రారంభించిన చాలా రోజులకు సబ్‌స్క్రైబర్స్ సంఖ్య పెరుగుతుంది. కానీ అంజిమామ తాను ఎంచుకునే కథలతో అభిమానులను ఆకట్టుకుని అతి తక్కువ సమయంలోనే సబ్‌స్క్రైబర్స్ సంఖ్యను పెంచుకున్నాడు. 'అంజి మామ' తన ఛానల్‌ను 2024 నవంబరు నెల మొదట్లో ప్రారంభించాడు. పది వీడియోలు చేయగా తొమ్మిందిటిని అప్‌లోడ్ చేశా డు. చానల్ ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటి వరకు 55,129మంది సబ్‌స్క్రైబర్స్ అయ్యారు. అంజి మామ వీడియోలకు 3.6మిలియన్ల వీక్ష ణలు వచ్చాయి. అయిదుగురు సభ్యులు గల బృందంతో చిత్రీకరిస్తున్న అంజిమామ ఛానల్‌లో అప్‌లోడ్ చేసిన వాటిలో 'అంజిమామ కారు, టూర్'కు 6లక్షల వీక్షణలు, 'కుండ చికెన్'కు 5లక్షలు, 'అంజిమామ అద్దె టూర్'కు 5.5లక్షలు, 'అంకాపూర్ చికెన్'కు 3లక్షల వీక్షణలు వచ్చాయి. అన్నింటిలోనూ అంజి ఉపయోగించే ఊత పదం 'అల్లుళ్లు, కోడళ్లు, ఎం జాయ్ చేయాలిరా' అనే దాంతో ప్రత్యేక గుర్తింపు వచ్చింది. అంజి ఎక్కడ కనిపించినా అభిమానులు చుట్టుముడుతూ అభిమానాన్ని చాటుకుంటున్నారు.


చిత్రీకరణలో అంజిమామ బృందం

● మై-విలేజ్ షోలతో అంజి మామగా గుర్తింపు..

అంజి మామ యూట్యూబ్, సినిమాల్లో సహజనటనతో అందరినీ ఆకట్టుకుంటూ మన్ననలు పొందుతున్నాడు. మల్యాల మండలం లంబాడిపల్లికి చెందిన మిల్కూరి అంజయ్య తన బంధువులు గంగవ్వ, మిత్రులు, పలువురు యువకులతో కలిసి మై-విలేజిషోలో అనేక వీడియోలతో యూట్యూబర్‌గా ఆకట్టుకున్నాడు. అంజయ్య కాస్తా అంజిగా గుర్తింపు పొందాడు. వినోదం, గ్రామీణ జీవనం, కుల వృత్తులు, లైఫ్‌స్టైల్, దొంగ పోలీస్, కుటుంబనేపథ్యం లాంటి దాదాపు వివిధ రకాలకు సంబంధించి 700లకు పైగా వీడియోలతో యూట్యూబ్‌లో మంచి గుర్తింపు పొందాడు. స్థానికంగా గల ఆసక్తికర అంశాలు, విజ్ఞానం, రైతులు, కార్మికులు, అవేర్‌నెస్, లోకల్ స్క్రిప్ట్ లాంటి అనేక వీడియోలు ఏదైనా వీక్షకులను అలరించే విధంగా తీర్చిదిద్దుతూ అంజిమామ బ్రాండ్‌గా వెలుగొందుతున్నాడు. ఇటీవలే అంజిమామ తానే సొంతంగా 'అంజిమామ చానల్' ఏర్పాటు చేశాడు. షార్ట్ ఫిలిమ్స్ చేస్తూ తన చానల్‌లోనే ఆ వీడియోలను అప్‌లోడ్ చేస్తున్నాడు.

●గ్రామంలో చిన్న షోలలో నటిస్తూ..

13ఏళ్ల క్రితం ఉపాధి నిమిత్తం ఇరాక్ వెళ్లి వచ్చిన అంజి గ్రామంలో కొందరు చేస్తున్న షోలలో చిన్నపాటి నటన చేస్తూ అందులోనే ఇమిడిపోయాడు. ఆ షోలలో మంచి పేరు రావడంతో యూ ట్యూబ్‌లో నటించడం కొనసాగించాడు. తోటి మిత్రులతో నటించిన పాత్రలకు గుర్తింపు రావడంతో పాటు చానల్‌కు వేలల్లో సబ్‌స్క్రైబర్స్ అయ్యారు. ఆ ప్రోత్సాహంతో అంజిమామగా పేరు తెచ్చుకుని రాణిస్తున్నాడు.

● సినిమాల్లోనూ రాణింపు

అంజిమామ యూట్యూబర్‌గానే కాకుండా సినిమాలు, ఇతర అనేక ప్రత్యేక కార్యక్రమాల్లో పాల్గొంటూ రాణిస్తున్నాడు. నెట్‌ఫ్లిక్స్ వెబ్‌సిరీస్‌లో రాములా., ఇంటింటి రామాయణం, మేం ఫేమస్, చరత-కామాక్షి, కేబుల్‌రెడ్డి, సోపతులు తదితర చిన్న సినిమాల్లో నటించాడు. అంజి తాను గుర్తింపు పొందడమే కాకుండా నటనపై ఆసక్తి గల యువత, చిన్నారులను ప్రోత్సహిస్తూ తన వీడియోలలో అవకాశం కల్పిస్తున్నాడు.

వైభవంగా గుంటి పెరమాండ్ల రథోత్సవం


రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

కోరుట్ల రూరల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల మున్సిపల్ పరిధిలోని ఎఖీన్‌పూర్ గ్రామ శివారులోని గుంటి పెరమాండ్ల (కట్ట కింది తీర్థం) రథోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో అర్చకుడు చింత సునీల్ ఆధ్వర్యంలో వేద పండితులు ఫనీంద్ర, అరుణ్ మంత్రోచ్ఛరణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు, బీజేపీ రాష్ట్ర నాయకుడు సురభి నవీన్‌రావు, కాంగ్రెస్ నాయకులు కొంత రాజం, పెరుమాండ్ల సత్యనారాయణ, ఉరుమడ్ల శ్రీనివాస్, బన్న రాజేష్, ఎర్ర శంకర్, జాగిలం చిన్న భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

ధనుర్మాసం సందర్భంగా ఆలయాల్లో భక్తుల రద్దీ

వేములవాడ కల్చరల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ధనుర్మాసం సందర్భంగా ఆలయాల్లో భక్తుల రద్దీ కనిపిస్తోంది. వేములవాడ రాజరాజేశ్వరస్వామి క్షేత్రం సోమవారం భక్తజన సంద్రంగా మారింది. కోడె మొక్కు చెల్లింపునకు సుమారుగా మూడు గంటలపాటు క్యూలైన్‌లో నిరీక్షించినట్లు భక్తులు తెలిపారు. మల్లికా ర్జునస్వామికి ఎంతో విశిష్టమైన షష్టిమాసం సందర్భంగా భక్తులు ముందుగా రాజన్నను దర్శించుకోవడం ఆనవాయితీ. వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆల యంలో ధనుర్మాసం సందర్భంగా అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సూర్యుడు ధనుర్మాసంలోకి సోమవారం ప్రవేశించడంతో ఉదయం స్వామివారితో పాటు రామచంద్రస్వామి, నారాయణమూర్తి స్వామికి ఉదయం ప్రత్యేక పూజలు చేశారు. పాలబోగ నైవేద్యాన్ని సమర్పించినట్లు ఆలయ అర్చకులు, ఆలయ సూపరిం టెండెంట్ తిరుపతిరావు వెల్లడించారు.


రాజన్న ఆలయం వద్ద భక్తులు


ధర్మపురిలో దర్శనం చేసుకుంటున్న భక్తులు

ధర్మపురిలో ఆలయంలో..

ధర్మపురి: ధనుర్మాసోత్సవాలు ధర్మపురి క్షేత్రంలో సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా మొదటి రోజున లక్ష్మీ నరసింహస్వామి, అను బంధ ఆలయాల్లో ఆలయ వేదపండితులు స్వామి వారలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకు ముందు గోదావరి నదిలో స్నానాలు ఆచరించిన భక్తులు ఆలయాలకు చేరుకుని స్వామిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెం ట్ అలువాల శ్రీనివాస్, అభిషేక్ పౌరోహితులు బొజ్జ సంతోష్‌కుమార్, సంపత్‌కుమార్ భక్తులు పాల్గొన్నారు.

ఎల్ఎల్‌బీ సెమిస్టర్ ఫలితాలు విడుదల

గణేశ్‌నగర్,డిసెంబర్ 16(ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో నవంబర్ 2024లో నిర్వహించిన ఎల్ఎల్‌బీ రెండో సెమిస్టర్ పరీక్షల ఫలితాలను శాతవాహన విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎస్వీ శ్రీరంగ ప్రసాద్ సోమవారం విడుదల చేశారు. ఈ ఫలితాలను శాతవాహన యూనివర్సిటీ వెబ్‌సైట్ www.satavahana.ac.inలో చూసుకోవచ్చని తెలిపారు.

పెండింగ్ బిల్లులపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలి

● మాజీ సర్పంచుల జేఏసీ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు కరుణాకర్

సిరిసిల్ల టౌన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : అసెంబ్లీ సమావేశాల్లో గ్రామాల్లోని అభివృద్ధి పనుల పెండింగ్ బిల్లులపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయకుంటే ఈ నెల 27న అమరవీరుల స్తూపం వద్ద మాజీ సర్పంచుల జేఏసీ కమిటీ ఆధ్వర్యంలో ఆమరణ నిరాహార దీక్ష చేపడతామని జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు అక్కెనపెల్లి కరుణాకర్ తెలిపారు. సోమవారం సిరిసిల్ల పట్టణ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో జేఏసీ కమిటీ జిల్లా అధ్యక్షుడు దుమ్మ అంజయ్యతో కలసి మాట్లాడారు. మాజీ సర్పంచుల అంశంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు హరీష్‌రావు, పల్ల రాజేశ్వర్‌రెడ్డి, కోవ లక్ష్మి, కొత్త ప్రభాకర్‌రెడ్డి, బీజేపీ ఎమ్మెల్యే వెంకటరమణరెడ్డి ప్రస్తావించడంపై కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి సీతక్క నుంచి స్పష్టమైన హామీ రాకపోవడాన్ని వ్యతిరేకించారు. రూ.691 కోట్ల మాజీ సర్పంచుల పెండింగ్ బిల్లులు చెల్లింపులపై స్పష్టమైన ప్రకటన చేయకుండా దాటవేసే ధోరణిని అవలంబించడం సరికాదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను అడ్డుకుంటామన్నారు. సమావేశంలో మాజీ సర్పంచుల జేఏసీ కమిటీ జిల్లా నాయకులు చాకలి రమేష్, గున్నాల లక్ష్మణ్, సిరికొండ శ్రీనివాస్, అరె మహేందర్, చిట్నేని శ్రీనివాస్‌రావు, మాజీ సర్పంచులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు కరుణాకర్



ఎమ్మెల్సీ ఎన్నికలపై బీఆర్ఎస్‌లో గందరగోళం

- బరిలోఉంటుందా.. లేదా?
- ఆశావహుల్లోనూ అనుమానం
- మౌనం వీడని అధిష్ఠానం

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

ఉత్తర తెలంగాణ అంటే బీఆర్ఎస్ పార్టీకి ఊపిరై నిలిచిన ప్రాంతం. మలిదశ తెలంగాణ ఉద్యమకాలంలో తన పార్టీ ఎమ్మెల్యేలను, ఎంపీలను రాజీనామాలు చేయించి వచ్చిన ఉప ఎన్నికలను ఉద్యమంలో అస్త్రాలుగా మలుచుకున్న బీఆర్ఎస్ ఆ తర్వాత కూడా ఏ ఎన్నికలు వచ్చినా తనదే పైచేయి అన్నట్లుగా వ్యవహరించేది. ఏడాదిగా అధికారానికి దూరమైనందుకో, మరెందుకో గాని తనకు పెట్టని కోటగా ఉంటూ వస్తున్న కరీం నగర్, మెదక్, నిజామబాద్, ఆదిలాబాద్ జిల్లాల పరిధిలో జరు గుతున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను ఏమాత్రం పట్టించు కోనట్టు ఉంటున్నది. కాంగ్రెస్, బీజేపీ ఓటర్ల నమోదు విష యంలో, ప్రచారం విషయంలో మూడు నెలలుగా నువ్వానేనా అన్నట్లు పోటీ పడుతున్నాయి. బీఆర్ఎస్‌లో ఎటువంటి కదలిక లేదు.

● ఎవరికి వారుగా ఆశావహుల ప్రచారం

బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిత్వాన్ని ఆశిస్తున్న కరీంనగర్ మాజీ మేయర్, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సర్దార్ రవీందర్‌సింగ్, ఐఎంఏ నాయకుడు డాక్టర్ బీఎన్ రావు మాత్రమే తమంత తాముగా కొంత మేరకు ఓటర్ల నమోదును చేపట్టి నియోజకవర్గ పరిధిలో తమ ప్రచారం చేసుకుంటున్నారు. బీఆర్ఎస్ అభ్యర్థిగానే మొదట ప్రచారం చేసుకున్న ట్రస్మా నాయకుడు యాదగిరి శేఖర్‌రావు పార్టీ ఎటూ తేల్చని వైఖరిని చూసి ఇండిపెండెంట్‌గా రంగంలో ఉంటానని ప్రకటించారు. రవీందర్‌సింగ్, బీఎన్ రావు మాత్రం అభ్యర్థులుగా పార్టీ గుర్తించినా, లేకున్నా పోటీలో ఉండాలని నిర్ణయించుకుని ప్రయత్నాలు చేస్తున్నారు. పార్టీ అభ్యర్థిని రంగంలో దింపుతుందా, లేదా అన్న విషయంలో వారికి కూడా స్పష్టత లేదని ప్రచారం జరుగుతున్నది. పార్టీ అగ్రనేతలైన కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు, కవిత పట్టభద్రుల నియోజకవర్గంలోనే ప్రజాప్రతినిధులుగా ప్రాతినిధ్యం వహిస్తున్నా ఎమ్మెల్సీ ఎన్నికలను పట్టించుకోవడం లేదు. ఈ నియోజవర్గం నుంచి బీఆర్ఎస్ మూడుసార్లు తన అభ్యర్థిని ఎమ్మెల్సీగా గెలిపించుకున్నది. గత ఎన్నికల్లో కాంగ్రెస్‌కు చెందిన జీవన్‌రెడ్డి గెలుపొందారు. ఆయన పదవీకాలం మార్చి నెలాఖరుతో ముగియనుండగా ఫిబ్రవరిలో ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. ఈ సందర్భంగా ఎన్నికల కమిషన్ ఓటర్ల నమోదు చేపట్టి ముసాయిదా జాబితాను సిద్ధం చేసింది. రెండో విడత ఓటర్ల నమోదుకు ఇచ్చిన గడువు కూడా ఈ నెల 9తో ముగిసింది. ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని కాంగ్రెస్, బీజేపీ పోటాపోటీగా నిర్వహిం చాయి. ప్రధానంగా కాంగ్రెస్ టికెట్ ఆశిస్తున్న అభ్య ర్థులు అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నమోదు కార్యక్రమాన్ని చేపట్టి మూడు లక్షల పైచిలుకు మం దిని ఓటర్లుగా చేర్పించారు.

● నియోజకవర్గంలో బలాబలాలు

నియోజకవర్గ పరిధిలో 42 అసెంబ్లీ, ఆరు పార్లమెంట్ స్థానాలు ఉన్నాయి. నాలుగు పార్లమెంట్ స్థానాల్లో, ఏడు అసెంబ్లీ స్థానాల్లో బీజేపీ ప్రాతినిధ్యం వహిస్తున్నోంది. 15 అసెంబ్లీ స్థానాల్లో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులున్నారు. వీరిలో ఇద్దరు ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరారు. వీరితో కలుపుకొని కాంగ్రెస్‌కు 22 మంది ఎమ్మెల్యేలు ఉండగా, ఇద్దరు ఎంపీలుఆ పార్టీ నుంచి ఎన్నికయ్యారు. 13 మంది ఎమ్మెల్యేలు, అందులో పార్టీ అగ్రనేతలు కూడా ఈ నియోజకవర్గ పరిధిలోనే ఉన్నా బీఆర్ఎస్ మాత్రం ఇక్కడ అభ్యర్థిని పోటీకి నిలుపుతుందా లేదా అన్నదానిపై స్పష్టత రావడ లేదు.

● నామమాత్రంగా కార్యక్రమాలు

కాంగ్రెస్, బీజేపీ నువ్వానేనా అన్నట్లు పోటీపడుతూ కార్యక్రమాలు నిర్వహిస్తుంటే బీఆర్ఎస్ మొక్కుబడిగా కొన్ని నిరసన కార్యక్రమాలకు పరిమితమయిందని కార్యకర్తలే అసం తృప్తిని వ్యక్తం చేస్తున్నారు. కీలక నేతలందరూ ఈ ప్రాంతంలోనే ఉన్నా పార్టీని చురుకుగా ఉంచడంలో ఎవరూ బాధ్యత వహించడం లేదని వారు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ ఉద్యమానికి, ఆ తర్వాత ఏర్పడిన ప్రభుత్వానికి వెన్నంటి ఉంటూ వచ్చిన ఉత్తర తెలంగాణలో పూర్వ వైభవం సాధించాలంటే ప్రస్తుతం అనుసరిస్తున్న వైఖరితో సాధ్యం కాదని బీఆర్ఎస్ శ్రేణులు అంటున్నాయి. ఉద్యమకాలంనాటి చైతన్యంతో పార్టీని ముందుకు నడిపే నాయకత్వం అవసరమనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. తొలి నుంచి తమకు అండగా ఉంటున్న జిల్లాల్లో జరుగుతున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించడం ద్వారా పార్టీ మళ్లీ ఉత్తేజితం అవుతుందనే అభిప్రాయాన్ని వారు వ్యక్తం చేస్తున్నారు. ఏడాది పాలనను ప్రజాపాలన విజయోత్సవాల పేరిట కాంగ్రెస్ ప్రజల్లోకి తీసుకువెళుతోంది. ఆ పార్టీ వైఫల్యాలను ఎండగట్టేందుకు నాయకత్వం ఆశించినరీతిలో ప్రయత్నం చేయడం లేదని పార్టీ శ్రేణులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. రాజకీయవర్గాలు మాత్రం ఈ విషయంలో పలు ఊహాగానాలు చేస్తున్నాయి. పరిస్థితులు అనుకూలించి విజయం సాధిస్తే పరవాలేదు కానీ, ఓడిపోతే స్థానిక సంస్థల ఎన్నికల్లో దాని ప్రభావం ఉంటుందని బీఆర్ఎస్ అధిష్ఠానం భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులతో నువ్వానేనా అన్నట్లు పోటీపడి విజయం సాధించే పరిస్థితులు ఉన్నాయా, లేవా అనే విషయంలో బీఆర్ఎస్ నాయకత్వం ఒక నిర్ణయానికి రాలేకపోతోందని తెలిసింది. అందుకే అభ్యర్థిని నిలిపే విషయాన్ని ప్రకటించకుండా ఆచీతూచి వ్యవహరిస్తున్నదని రాజకీయవర్గాలు అంటున్నాయి. ఈ విషయంలో బీఆర్ఎస్ ఏం నిర్ణయం తీసుకోబోతుందో అని అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

మధ్యాహ్న భోజన నిర్వాహకులకు 'గుడ్డు' భారం

● పెరిగిన ధరలతో నష్టం ● బిల్లులు రాక కార్మికుల అవస్థలు


వంటచేస్తున్న నిర్వాహకులు


కథలాపూర్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో విద్యార్థులకు భోజనం పెట్టే నిర్వాహకులకు కోడిగుడ్డు భారంగా మారింది. ప్రభుత్వం నిర్వాహకులకు గుడ్డుకు కేవలం రూ. 5లు ఇస్తుండగా బహిరంగ మార్కెట్‌లో ప్రస్తుతం రూ. 7 ధర పలుకుతోంది. ఈ క్రమంలో వంట చేసే కార్మికులకు నష్టం ఎక్కువగా ఉంటోంది. దీంతో నిర్వాహకులు భోజనంలో కోడిగుడ్డు పెట్టడానికి వెనకంజ వేస్తున్నారు.

● వారానికి మూడు సార్లు...

మండలంలో 30 మండల పరిషత్ పాఠశాలలు, 4 ప్రాథమికోన్నత, 10 జిల్లా పరిషత్, కస్తూర్బాగాంధీ, మోడల్ స్కూల్‌లో సుమారు 4 వేల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరికి ప్రభుత్వం వారంలో మూడు సార్లు కోడిగుడ్డు ఇవ్వాలనే నిబంధన విధించింది. నిర్వాహకులు అప్పులు చేసి ఉడకబెట్టిన కోడిగుడ్లను విద్యార్థులకు అందించాల్సిన దుస్థితి నెలకొంది. అసలే గత మూడు నెలలుగా బిల్లులు ప్రభుత్వం నుంచి రాక నిర్వాహకులు ఆందోళనలు నిర్వహిస్తున్నారు. దీనికి తోడు ప్రభుత్వం ఇచ్చే ధర కంటే బహిరంగ మార్కెట్‌లో రు.2లు అధికంగా ఉండడంతో వచ్చే కమీషన్ కూడా పొందలేని పరిస్థితి దాపురించిందని వాపోతున్నారు. వంట గదుల్లేక కొందరు ఆరుబయటే వంటలు చేస్తూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ పట్టించుకునే నాథుడే కరవయ్యాడు. విద్యార్థుల సంఖ్య తక్కువ ఉన్న చోట నిర్వాహకులకు లాభం రాకపోగా నష్టాలతో కాలం గడుపుతున్నారు. 5 తరగతుల లోపు ఒక్కో విద్యార్థికి రు. 6లు, 9వ తరగతి స్థాయిలో రు. 9లు, పదవ తరగతి విద్యార్థులకు రు. 10ల చొప్పున కమీషన్ చెల్లిస్తున్నారు.

ప్రభుత్వమే కోడిగుడ్డు సరఫరా చేయాలి

- చెన్నవేని దశరథం, సీఐటీయు జిల్లా నాయకులు



కోడిగుడ్డు ధరలు బహిరంగ మార్కెట్‌లో కొండెక్కడంతో నిర్వాహకులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోంది. అందువల్ల ప్రభుత్వమే పాఠశాలలకు కోడిగుడ్లు సరఫరా చేయాలి. ప్రభుత్వం పాఠశాలల్లో వెట్టిచాకిరి చేయిస్తోంది. హెల్పర్లకు రు 3 వేలు ఇస్తామని చెప్పి అందులో వెయ్యి రూపాయలు ఇవ్వడమే లేదు. నెలల తరబడి వేతనాలు, బిల్లులు చెల్లించపోవడం దారుణం.

రోజురోజుకూ పెరుగుతున్న అప్పులు

- భారత, నిర్వాహకురాలు ఊట్‌పల్లి



అసలే చాలీచాలని కమీషన్‌తో పొగ మధ్య వంటలు చేస్తూ విద్యార్థులకు భోజనం పెడుతున్నా ప్రభుత్వాలు కనికరించడం లేదు. ఏళ్ళ తరబడి వివిధ రకాల నిరసనలు చేస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. వంటకు అవసరమ్యే సరుకులు అప్పులు చేసి కిరాణాల్లో తెస్తున్నాం. మరో పక్క కోడిగుడ్డు ధరలు పెరగడంతో నష్టాలకు గురై అప్పుల్లో కూరుకు పోతున్నాం. రెగ్యులర్ చేసి న్యాయం చేయాలి.

శివాలయంలో అన్నపూజ

సుల్తానాబాద్, డిసెంబరు 16: (ఆంధ్ర జ్యోతి): పట్టణంలోని పురాతన గుడి మిట్టపల్లి శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీరాములపల్లి గ్రామానికి చెందిన మిట్టపల్లి రాజేశ్వరి-చంద్రమౌళి దంపతులు అన్నపూజకు ఏర్పాట్లు చేయగా పండితులు అశోక్ తదితరులు పూజాది కార్యాక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో తొడుపు నూరి రాజేంద్రప్రసాద్ ప్రసన్నలక్ష్మి, కొమురవెల్లి అరుణ శ్రీనివాస్, శ్రీకాంత్, వేణుగోపాల్ పాల్గొన్నారు. స్థానిక పాతబజారులోని శివాలయంలో పూజారి వల్లం కొండ రజత మహేష్ తదితరులు రుద్రాభిషేకాలు ప్రత్యేక పూజలు చేశారు.

న్యాయవాది మృతిపై సంతాపం

సుల్తానాబాద్, డిసెంబరు 16 (ఆంధ్ర జ్యోతి): పట్టణానికి చెందిన సీని యర్ న్యాయవాది కాసర్ల అనంతరెడ్డి మృతి చెందగా బార్ అసోసియేషన్ ఆధ్వ ర్యంలో సుల్తానాబాద్ కోర్టులో న్యాయ వాదులు నివాళులర్పించారు. కార్యక్ర మంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పడాల శ్రీరాములు, ప్రధాన కార్యదర్శి జోగుల రమేష్, ఏజీపీ దూడం అంజ నేయులు, న్యాయవాదులు పబ్బతి లక్ష్మీ కాంతరెడ్డి, ఆవుల లక్ష్మీరాజం, మాదూరి ఆంజనేయు లు, మేకల తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

కమాన్‌పూర్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జూలపల్లి గ్రామంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో మెడికవర్ ఆసుపత్రి సహకారంతో సోమ వారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిం చారు. ఈ శిబిరంలో 150 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు డక్టార్ నాగరాజు, డాక్టర్ శ్రీకాంత్, మెడికవర్ సెంటర్ హెడ్ గుర్రం కిరణ్, యాదవ సంఘం నాయకులు బోసు తిరుపతి, జై కొమురయ్య, మదాసి శివ, సాయిశంకర్, రవీందర్, జగన్, తిరుపతి, రాజ్‌కుమార్, హరీష్, మార్కెటింగ్ మేనేజర్ కోట కర్ణాకర్, బొంగోని హరీష్, శ్రీనివాస్ ఉన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా బెల్టు షాపులు

● మాజీ ఎంపీటీసీ మల్యాల రాజయ్య

ముత్తారం డిసెంబరు 16 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని బెల్టుషాపులు విచ్చలవిడిగా వెలుస్తున్నా.. గ్రామాల్లో మద్యం ఏరులై పారుతున్నా.. ఎక్సైజ్ పోలీసులు పట్టనట్టు వ్యవహరిస్తున్నారని మాజీ ఎంపీటీసీ మల్యాల రాజయ్య ఆరోపించారు. ఆయన సోమవారం ముత్తారం కాసర్ల గడ్డలోని ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. మండల కేంద్రంలో ఉన్న రెండు వైన్ షాపులు రోడ్డు పక్కన ఏర్పాటు చేయడంతో ప్రజల రాకపోకలకు ఇబ్బంది కలుగుతోందన్నారు. మరోవైపు గ్రామాల్లో బెల్టు షాపులను విచ్చలవిడిగా నడుస్తున్నా యన్నారు. ఎక్సైజ్ అధికారులకు సమా చారం ఇచ్చినా వారు పట్టించుకోవడం లేదని తెలిపారు. అధికారులు స్పందించి బెల్ట్ షాపులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అనుము సమ్మయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

కాల్వశ్రీరాంపూర్, డిసెంబరు 16 (ఆంధ్ర జ్యోతి): మండల కేంద్రంలో అనుముల లక్ష్మి ఇటీవల మృతిచెందగా మృతురాలి కుటుంబాన్ని యూత్ కాంగ్రెస్ మండల శాఖ అధ్యక్షుడు సొన్నాయిటెంకం శివరామ కృష్ణ సోమవారం పరామర్శించారు. మృతు రాలి కుటుంబానికి 50కిలోల బియ్యం అందజేశారు. ఆయన వెంట తాండ్ర సురే ష్, మంతెన రామస్వామి, తాండ్ర రాకేష్, గాజుల అన్వేష్, గడ్డం రాజేష్, సునీల్, వేణు, అంజి, శ్రీకాంత్, భూమయ్య, దేవరా జ్, నరేందర్ ఉన్నారు.

వామ్మో.. కోతులు

– ఇళ్లపైకి గుంపులు గుంపులుగా.. – స్టేడియంలో వాకర్స్‌పై దాడికి యత్నిస్తున్న వానరసైన్యం

ఫిర్యాదు చేసినా పట్టించుకోని సింగరేణి, కార్పొరేషన్ అధికారులు



స్టేడియంలో తిరుగుతున్న కోతులు

కళ్యాణ్‌నగర్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రామగుండం కార్పొరేషన్‌లో రోజురోజుకు కోతుల బెడద పెరగడంతో స్థానికులు హడలెత్తిపోతున్నారు. గుంపులు గుంపులుగా రాత్రిపగలు తేడా లేకుండా ఇళ్లలోకి వస్తూ ఇంట్లో సామగ్రిని చిందరవందరగా చేస్తున్నాయి. కోతులను బెదిరించబోయి ఇద్దరు ముగ్గురు కాళ్ల, చేతులు విరగొట్టుకున్న ఘటనలు కూడా చోటు చేసుకు న్నాయి. పట్టణంలో ఎక్కడ పడితే అక్కడ గుంపులు గుంపులుగా సంచరిస్తూ ఇళ్లలోని పండ్లు, కూరగాయల చెట్లను నాశనం చేస్తున్నాయి. ఇళ్లపై గార్డెన్స్‌లో పండిం చే కూరగాయలను కూడా తింటున్నాయి. ఉదయం సమయంలో గోదావరిఖని జవహర్‌లా ల్ నెహ్రూ స్టేడియంలో వాకర్లను పరుగెత్తిస్తున్నాయి. ఉదయం, రాత్రిళ్లు పదుల సంఖ్యలో కోతులు స్టేడియం లో చేరి హంగామా సృష్టిస్తున్నాయి. ఆరు రోజుల క్రితం మహిళలు వాకింగ్ చేస్తుండగా వారిని వెంబడించడంతో మహిళలు భయభ్రాంతులకు గురయ్యారు. సెలవురోజు ల్లో పిల్లలు స్టేడియంలోకి వస్తేవారిపై దాడులకు పాల్పడుతున్నాయి. నిత్యం స్టేడియంలో పదుల సంఖ్య లో కోతులు సంచరిస్తూ హంగామా చేస్తున్నాయి. పక్కనే ఉన్న దుర్గామాత ఆలయంలో కూడా భక్తులను వెంబడిస్తున్నాయి. తిలక్‌నగర్, విఠల్‌నగర్, కళ్యాణ్‌నగర్, లక్ష్మీనగర్, అడ్డగుంటపల్లి, విద్యానగర్, పవర్‌హౌస్‌కాలనీ, ఐబీ కాలనీ ఏరియాల్లో కోతుల సంచారం పెరిగిపోయింది. ఉదయ్‌న గర్‌లో ఓ వ్యక్తిని చుట్టుముట్టి దాడి చేశా యి. తిలక్‌నగర్‌లో చిన్న పిల్లలు రోడ్డుమీద ఆట ఆడుతుంటే వారిపై కూడా దాడికి యత్నించాయి. కొన్ని ఇళ్లలో చొరబడి ఇంట్లో ని వస్తువులను అందినకాడికి తీసుకపోవ డం, చింతరవందరగా పడేస్తున్నాయి. కోతుల దాడుల్లో రోజుకు ముగ్గురు నుంచి నలుగురు గాయపడుతున్నారు. కోతులనుపట్టి దూర ప్రాంతాల్లోని అడవుల్లో వదిలిపెట్టాలని ఎన్నిసార్లు రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ అధికారులకు, సింగరేణి జీఎంకు విన్నవించినా స్పందించడంలేదని స్థానికులు, క్రీడాకారులు ఆరోపిస్తున్నారు.



రోడ్డుపై గుంపులుగా తిరుగుతున్న కోతులు

స్టేడియం వెళ్లాలంటే భయం వేస్తుంది..

బోయిని మల్లేష్, వాకర్



స్టేడియంలో ఉదయం, రాత్రి వాకింగ్ చేయాలంటే ఇబ్బందులు పడాల్సి వస్తోం ది. కోతులు గుంపులు గుంపులుగా వచ్చి నడుస్తు న్న వారిపై దాడులు చేస్తు న్నాయి. మహిళలను కూడా వెంబడించడంతో వారు కిందపడిపోతున్నారు. కోతులను పట్టించాలని ఎన్నిసా ర్లు సింగరేణి, కార్పొరేషన్ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు.

ఉద్యోగ, కార్మిక సంఘాలపై నజర్

(5వ పేజీ తరువాయి..)

పండించిన రైతులకు క్వింటాలుకు 500 బోనస్ ఇచ్చింది. రెండు లక్షల వరకు రైతులకు రుణ మాఫీ చేసింది. అలాగే గ్రూపు- 1, గ్రూప్- 2, గ్రూప్- 3 పరీక్షలను, డీఎస్సీ నిర్వహించింది. గ్రూప్- 4 ఉద్యోగులకు ఈ నెల 4న పెద్దపల్లిలో నిర్వ హించిన యువ వికాసం సభ ద్వారా ఉద్యోగ నియామక పత్రాలను సీఎం అందజేశారు. ఇవేగాకుండా పలు పథకాలను ప్రభుత్వం ఈ ఏడాది కాలంలో అమలు చేసింది.

● వివిధ సంఘాల ఆందోళన బాట..

ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, కుల సంఘాలు, ఇతర సంఘాల వారు ఏడాది పాటు వేచి చూశారు. ఐనా తమ సమస్యలు పరిష్కారం కాకపోవడంతో వివిధ సంఘాలు ఆందోళన బాట పట్టాయి. గత ప్రభుత్వ హయాంలో చేసిన పనులకు సంబంధించిన పెండింగు బిల్లులపై మాజీ సర్పంచ్‌లు చలో హైదరాబాద్ కార్యక్ర మాన్ని చేపట్టారు. మెప్మాలో పనిచేస్తున్న ఉద్యోగులు సైతం ఇటీవల చలో హైదరాబాద్ కార్యక్రమానికి వెళ్ల డాన్ని ఎక్కడికక్కడే నిలువరించి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎన్నికల సందర్భంగా తమకు నెలకు 18 వేల వేతనం ఇస్తామని కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ ఆశా వర్కర్ల బస్సు జాత కార్యక్రమాన్ని చేపట్టారు. అలాగే అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు కూడా ఆందోళనకు సిద్ధం అయ్యారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించా లని, తమ ఉద్యోగాలను పర్మనెంట్ చేసి పేస్కేల్ వర్తింపజేయాలని కేజీబీవీ టీచర్లు, సమగ్ర శిక్షలో పనిచేస్తున్న సీఆర్‌పీలు సమ్మె చేస్తున్న విషయం తెలిసిందే. దీంతో కస్తూర్బా పాఠశాలల్లో వారం రోజులుగా విద్యాబోధనకు ఆటంకాలు ఏర్పడుతున్నాయి. ఒక్కరొక్కరుగా ఆందోళన బాట పడుతుండడంతో ఆయా ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, కుల సంఘాల కదలికలపై ప్రభుత్వం ఇంటిలిజెన్స్ వర్గాలు ఎప్పటికప్పుడు ఆరా తీసి ప్రభుత్వానికి నివేదిస్తున్నాయి.

ఘనంగా అయ్యప్ప పడిపూజ



పడిపూజ నిర్వహిస్తున్న అయ్యప్ప భక్తులు

కాల్వశ్రీరాంపూర్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పాండవులగుట్ట సమీపంలో అయ్యప్ప ఆలయం నిర్మించబోయే స్థలంలో అయ్యప్ప సేవాసంఘం ఆధ్వర్యంలో చంద్రమౌళి, వెంకటేష్‌శర్మ గురుస్వామి నేతృత్వంలో సోమవారం అయ్యప్ప మహాదివ్య పడిపూజ మహోత్సవం ఘనంగా నిర్వహించా రు. అయ్యప్పస్వామికి అష్టాదశ కళశాలతో పంచామృతాలతో అభిషేకం నిర్వహించా రు. పడిపూజ మహోత్సవానికి మండల అయ్యప్పస్వాములు హాజరయ్యారు. స్వామియేశరణం అయ్యప్ప అంటూ అయ్యప్పస్వామి నామస్మరణతో మార్మోగింది. 18మెట్లను పూలతో అలంకరించి కర్పూర దీపాలు వెలిగించి పడిపూజ నిర్వహించారు. వేడుకలో అయ్యప్ప నిర్మాణ కమిటీ అధ్యక్షుడు పెద్దిరెడ్డి వీరారెడ్డి, ఉమ్మడి రాష్ట్ర మత్స్యశాఖ మాజీ చైర్మన్ చేతి ధర్మయ్య, మాజీ ఎంపీపీ గోపగోని సారయ్యగౌడ్, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ రామిడి తిరుపతిరెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ చదువు రామచంద్రారెడ్డి, మాజీ జడ్పీటీసీలు వంగల తిరుపతిరెడ్డి, గంట రాములు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సదయ్య పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు భిక్ష ఏర్పాటు చేశారు. ఆలయం నిర్మాణానికి విరాళాలు అందించిన దాతలను అయ్యప్ప సేవా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అయ్యప్ప సేవాసంఘం సభ్యులు ప్రజాప్రతినిధులు అయ్యప్పస్వాములు తదితరులు పాల్గొన్నారు.

రామగుండంలో పెరిగిన చలి

10 డిగ్రీలకు పడిపోయిన ఉష్ణోగ్రతలు

కళ్యాణ్‌నగర్/మార్కండేయకాలనీ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో చలి వణికిస్తోంది. ఆదివారం రాత్రి అత్యల్పంగా 10.5డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు అయ్యింది. ఈ ఏడాదిలో ఇదే అత్యల్ప ఉష్ణోగ్రత. వారం రోజులుగా రాత్రిపూట ఉష్ణోగ్రతలు పడిపోతూ వస్తున్నాయి. గత మంగళవారం 15డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా బుధవారం మూడు డిగ్రీలు పడిపోయి 12.4 డిగ్రీలు, గురువారం 13.4డిగ్రీలు, శుక్రవారం 12.6డిగ్రీలు, శనివారం 11.6డిగ్రీలు, ఆదివారం 10.5డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదు అయ్యింది. ఇది సాధారణ ఉష్ణోగ్రతల కంటే 4.7డిగ్రీలు తక్కువ. రాత్రి ఏడు గంటలు దాటితే రోడ్లపై జనాలు నిర్మానుశ్యంగా కనిపిస్తున్నాయి. ఉదయం కూడా చలి తీవ్ర ఎక్కువగా ఉంటుంది. ఉదయం 9గంటల దాటినా చలి ప్రభావం తగ్గడం లేదు. ఉదయం షిఫ్టులకు వెళ్లే కార్మికులు ఉన్ని దుస్తులు ధరించి విధులకు హాజరవుతున్నారు. మున్సిపల్ కార్మికులు తెల్లవారుజామునే చలిలో ఇబ్బందులు ఎదుర్కొంటూ పారిశుధ్య పనులు నిర్వహిస్తున్నారు. పారిశ్రామిక ప్రాంతంలోని వాడల్లో చలి మంటలతో ప్రజ లు ఉపశమనం పొందుతున్నారు. గోదావరిఖని చౌరస్తా, బస్టాండ్ ప్రాంతాల్లో టిబెటన్ల శరణార్థుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉన్నిదుస్తుల కేంద్రంతో పాటు పలు చోట్ల ఏర్పాటు చేసిన ఉన్నిదుస్తుల కేంద్రాలు కొనుగోలుదా రులతో కిటకిటలాడుతున్నాయి.

ఇబ్బందులు పడుతున్న రోగులు...

చలితీవ్రత పెరగడంతో ఆస్తమా రోగులు తీవ్ర ఇబ్బం దులు ఎదుర్కొంటున్నారు. చలి కాలంలో గుండె వ్యాధులు కూడా సంక్రమించే అవకాశం ఉందని వైద్యులు పేర్కొంటు న్నారు. చాలా మంది ఉదయం పూట వాకింగ్, జాగింగ్ చేసేవారు కూడా చలి ప్రభావంతో సూర్యోదయం వరకు వేచి చూస్తున్నారు. వృద్ధులు చలికి తట్టుకోలేని పరిస్థితి ఏర్పడింది. చలిమంటలతో ఉపశమనం పొందుతున్నారు. చిన్నపిల్లలు సైతం దగ్గు, జలుబు భారిన పడుతున్నారు.

యువజన కాంగ్రెస్ అధ్యక్షులకు సన్మానం

ధర్మారం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): యువజన కాంగ్రెస్ ధర్మపురి నియోజకవర్గ అధ్యక్షులతో పాటు ధర్మారం మండల యువజ న కాంగ్రెస్ అధ్యక్షులను కాంగ్రెస్ పార్టీ నాయ కులు సోమవారం సన్మానించారు. ధర్మపురి నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా అజయ్, ధర్మారం మండల యవజన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా సోగాల తిరుపతి, మండల యవజన కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రెటరీగా పాలకుర్తి సాయిని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ నియమించారు. ఈ సందర్భం గా వీరిని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ లావుడ్య రూప్లానాయక్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు శాలువాలతో సత్కరించి సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గాగిరెడ్డి తిరుపతిరెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మెన్ అరిగె లింగయ్య, మాజీ సర్పంచ్ గంగారెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానంతో అంధత్వ నివారణ

ఓదెల, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నేత్రదానంతో అంధత్వాన్ని నివారించవచ్చని సదాశయ ఫౌండేషన్ జాతీయ కార్యదర్శి మేర్గు భీష్మచారి అన్నారు. మండల కేంద్రంలో బూర సదానందం అనే దివ్యాంగుడు సోమవారం అనారోగ్యంతో మృతిచెందగా కుటుంబసభ్యు లు సదాశయ ఫౌండేషన్‌కు నేత్రాలను దానం చేశారు. ఈ మేరకు నేత్ర, అవయవ, శరీర దానాలపై సదాశయ ఫౌండేషన్ జాతీయ కార్యదర్శి మేర్గు భీష్మాచారి అవగాహన కల్పిం చారు. అనంతరం మృతుడి నేత్రాలను సేకరించి ఎల్వీప్రసాద్ ఆసుపత్రికి తరలించా రు. కార్యక్రమంలో ప్రచార కార్యదర్శి వాసు, చీకట్ల మొండయ్య, క్యాతం వెంకటేశ్వర్లు, ఇప్ప నపల్లి వెంకటేశ్వర్లు, సారంగం పాల్గొన్నారు.

దుస్తులు పంపిణీ

పెద్దపల్లి రూరల్, డిసెంబరు 16 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని రాఘవపూర్‌లో గల ఎల్ఎంఎన్ ఇటుక బట్టీల్లో పెద్దపల్లి బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఉప్పు రాజ్‌కు మార్ ఆధ్వర్యంలో సోమవారం పాత బట్టలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా రాజ్‌కుమార్ మాట్లాడుతూ ఇళ్లల్లో దుస్తులు కొనుగోలు చేశాక పాత దుస్తులను బయట పడేయకుం డా వలస కార్మికులకు అందించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమ్మెలో పాల్గొన్న దివ్యాంగ విద్యార్థులు

పెద్దపల్లి రూరల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా సమగ్ర శిక్ష అభియాన్(ఎస్ఎస్ఏ) ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాల ని జేఏసీ జిల్లా అధ్యక్షుడు తిప్పని తిరుపతి అన్నారు. పెద్దపల్లి ఎంపీడీవో కార్యాల యం ఎదుట ఎస్ఎస్ఏ ఉద్యోగుల నిరవధిక సమ్మె సోమవారం నాటికి ఏడో రోజుకు చేరింది. ఈసందర్భంగా సమ్మెకు వికలాంగ విద్యార్థులు, వారి తల్లిదండ్రు లు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం ముఖ్య సలహాదారులు కుంభాల సుధాకర్, ఉద్యోగులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకుడి

స్థూపం కూల్చివేత



ఎక్స్‌కావేటర్‌తో స్థూపాన్ని కూల్చుతున్న అధికారులు

కోల్‌సిటీ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని మున్సిపల్ జంక్షన్ సమీపంలోని సప్తగిరికాలనీ రహదారి లో గల సీపీఐ(ఎంఎల్) న్యూడెమోగ్రసీ నాయకుడు యూ రాములు స్మారక స్థూపాన్ని సోమవారం తెల్లవారుజాము న నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు కూల్చివేశారు. మెడికల్ కళాశాల విస్తరణలో భాగంగా ఈ స్థూపాన్ని తొలగించనున్నట్లు గతంలోనే అధికారులు నోటీసు ఇచ్చారు. దీనికి న్యూడెమోక్రసీ నాయకులు తమ కు ప్రత్యామ్నాయ స్థలం చూపి స్థూపం నిర్మించి ఇవ్వాలని అదనపు కలెక్టర్‌కు ఇచ్చిన లేఖలో పేర్కొన్నారు. దీనిపై అధికార యంత్రాంగం స్పందించలేదు. ప్రభుత్వ స్థలంలో అనధికారికంగా నిర్మించిన స్థూపాన్ని తొలగించేందుకు నిర్ణయించారు. సోమవారం తెల్లవారేసరికి స్థూపం పూర్తిగా తొలగించారు. పక్కనే ఉన్న సింగరేణి ప్రహరిని కూడా తొలగించారు. ఉదయం స్థలాన్ని చదును చేశారు. తొలగిం చిన స్థూపం ప్రాంతాన్ని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు పరిశీలించారు.

న్యూడెమోక్రసీ నాయకుల నిరసన

కళ్యాణ్‌నగర్: సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకు డు యూ రాములు స్థూపాన్ని కూల్చివేయడాన్ని నిరసిస్తూ సోమవారం గోదావరిఖని గాంధీనగర్ ఫైలాన్ వద్ద రహదారిపై న్యూడెమోక్రసీ, ఐఎఫ్‌టీయూ నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి రాజన్న, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు నరేష్ మాట్లాడుతూ 2004 సంవత్సరంలో యూ రాములు హత్య కు గురయ్యాడన్నారు. ఆయన స్మారకార్థం మున్సిపల్ టీ జంక్షన్ వద్ద స్థూపాన్ని నిర్మించామన్నారు. రాములు కార్మికవర్గం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం, హక్కుల సాధన కోసం, ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటం చేశారన్నారు. మున్సిపల్ అధికారులు రాములు స్థూపాన్ని తొలగించ డాన్ని ఖండిస్తున్నామన్నారు. మరో చోట స్థూపం ఏర్పాటు కు కలెక్టర్ స్థలం కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు అశోక్, శంకర్, దుర్గయ్య, బుచ్చయ్య, మల్లేషం, సాంబయ్య, రాయమల్లు, రాజయ్య, నర్సయ్య, ప్రవీణ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



అప్రమత్తంగా విధులు నిర్వహించాలి



షీల్డ్ అందజేస్తున్న సూర్యనారాయణ

యైటింక్లయిన్‌కాలనీ, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): డ్యూటీలో ఉన్న ప్రతి ఉద్యోగి ప్రతిక్షణం అప్రమత్తంగా ఉండాలని జీఎం(ఓసీపీలు) సూర్యనారాయణ రాజు సూచించారు. 55వ వార్షిక భద్రోత పక్షోత్సవాల్లో భాగంగా సోమవారం ఓసీపీ-1 సీహెచ్‌పీ తనిఖీ బృందానికి ఆయన కన్వీనర్‌గా వ్యవహరించారు. సింగరేణిలోనే ఓసీపీ-1 సీహెచ్‌పీ పెద్దదని, ప్రతి ఏడాది బొగ్గు రవాణా లక్ష్యాన్ని సాధించడంలో ఉద్యోగుల శ్రమ అభినందనీయమని సూర్యనారా యణరాజు పేర్కొన్నారు. పని స్థలాల్లో రక్షణ సూత్రాలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. ఈసందర్భంగా సీహెచ్‌పీకి వచ్చిన కోలింగ్ షీల్డ్‌ను ఆయన అధికారులు, ఉద్యోగులకు అందజేశారు. అనంతరం ఉద్యోగులు రక్షణ మన బాధ్యత అనే లఘు నాటిక ఆకట్టుకున్నది. ఈకార్యక్రమంలో అధికారులు శేఖర్‌బాబు, కాశీవిశ్వేశ్వరరావు, జీ రాజశేఖర్, ఉదయహరిజన్, గుర్తింపు ప్రాతినిధ్య సంఘాల నాయకులు గంధం శ్రీనివాస్, కోట రవీందర్‌రెడ్డి తనిఖీ బృందం సభ్యులు పాల్గొన్నారు.

ఆర్జీ-2లో మహిళలకు ఆటలపోటీలు

యైటింక్లయిన్‌కాలనీ, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): సింగరేణి ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆర్జీ-2 యాజమాన్యం సోమవారం లేడీస్ క్లబ్ మహిళలకు ఆటలపోటీలను నిర్వహించింది. స్థానిక ఎస్సీఓఏ క్లబ్‌లో జరిగిన పోటీల్లో త్రోబాల్, బాల్‌ఇన్‌త్రో, బాంబ్ ఇన్‌సిటీ వంటి ఆటలలో క్లబ్ మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు 23న జరిగే ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో బహుమతులు అందజేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఈకార్యక్రమంలో స్పోర్ట్స్ సూపర్‌వైజర్ నరేందర్‌రెడ్డి, లేడీస్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

కార్మికులకు ఇచ్చిన హామీలు వెంటనే నెరవేర్చాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని సీఐటీయూ ఆధ్వర్యంలో సింగరేణి వ్యాప్తంగా ఆందోళనలు చేపట్టనున్నట్లు ఆర్జీ-2 బ్రాంచి సెక్రెటరీ కుంట ప్రవీణ్ పేర్కొన్నారు. సోమవారం ఓసీపీ-3 కృషి భవన్‌లో ఆందోళనల పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈసందర్భంగా ప్రవీణ్ మాట్లాడారు. సింగరేణి కార్మికుల ప్రధాన సమస్యలైన సొంత ఇంటి పథకం, పెర్క్స్‌పై ఐటీ రీయంబర్స్ చేస్తామని రాజకీయ పార్టీలు, యూనియన్లు కాలయాపన చేస్తున్నాయే తప్ప అమలుకు ఎటువంటి ప్రయత్నాలు చేయడం లేదని అన్నారు. రిటైర్మెంట్ అనంతరం కార్మికుడి వచ్చే ఆర్థిక ప్రయోజనాలు సొంత ఇల్లు కట్టుకోవడానికి సరిపోతున్నాయని, వృద్ధాప్యంలో ఆర్థిక ఆసరాలేకుండా పోతున్నట్లు తెలిపారు. పెర్క్స్‌పై ఐటీని రీయంబర్స్ చేయాలని జేబీసీసీఐలో ఒప్పందం జరిగిందని, దేశంలోని ఇతర బొగ్గు సంస్థలో దీన్ని అమలు చేస్తున్నా సింగరేణి కార్మికులకు మాత్రం అమలు కావడం లేదని ప్రవీణ్ పేర్కొన్నారు. సింగరేణిలో అధికారులకు సైతం రీయంబర్స్ అవుతున్నా కార్మికులకు కాకపోవడంలో ఇక్కడి యూనియన్లు, ప్రభుత్వాల వైఫల్యమని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థులు చేసిన వాగ్దానాలను గుర్తుచేసుకోవాలని కోరారు. సొంత ఇంటి పథకం, పెర్క్స్‌పై ఐటీ రద్దు హామీలతో కోల్‌బెల్ట్ వ్యాప్తంగా సింగరేణి కార్మికులు కాంగ్రెస్ అభ్యర్థులకు పట్టంకట్టినట్టు ప్రవీణ్ పేర్కొన్నారు. గుర్తింపు సంఘం ఎన్నికల సందర్భంగా అన్ని యూనియన్లు ఇవే వాగ్దానాలు ఇచ్చాయని, గెలిచిన సంఘాలు స్ట్రక్చర్ సమావేశాల్లో సొంత ఇంటి పథకం అమలు, పెర్క్స్‌పై ఐటీ రద్దు సమస్యలను ప్రస్తావించకుండా కార్మికులను మోసగిస్తున్నాయని అన్నారు. హామీల అమలుకు సీఐటీయూ చేసే ఉద్యమానికి కార్మికవర్గం కలసిరావాలని ప్రవీణ్ పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో ఎస్ వెంకన్న, వినేష్, భూమయ్య సంతోష్, కిషోర్, నాగార్జున పాల్గొన్నారు.

స్క్రాప్ దుకాణాల్లో తనిఖీలు

గోదావరిఖని, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని స్క్రాప్ దుకాణాల్లో సోమవారం సింగరేణి సెక్యూరిటీ సిబ్బంది తనిఖీలు జరిపారు. వెంగళ్‌గౌడ్, పవన్, అజీం స్క్రాప్ దుకాణాల్లో తనిఖీలు చేసి నిర్వహించారు. సింగరేణి సంస్థకు చెందిన టన్ను స్క్రాప్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ స్క్రాప్‌ను పాత పవర్‌హౌస్‌యార్డుకు తరలించినట్లు సెక్యూరిటీ ఆఫీసర్ వీరారెడ్డి పేర్కొన్నారు. ఈ తనిఖీల్లో జూనియర్ ఇన్‌స్పెక్టర్ ఉమేష్, చందా శ్రీనివాస్, జమేదా ర్లు బోయిని ఓదెలు, భోజ్యా, ఇంటలీజెన్స్ టీమ్ తిరుపతి, రాధాకృష్ణ, సెక్యూరిటీ సూపర్‌వైజర్లు అజయ్, కంది శ్రీనివాస్ పాల్గొన్నారు.



దుకాణాల నుంచి స్వాధీనం చేసుకున్న సింగరేణి స్క్రాప్

కన్వేయన్స్ డ్రైవర్‌ను విధుల్లోకి తీసుకోవాలి



ఆర్జీ-1లో మాట్లాడుతున్న కన్వేయన్స్ డ్రైవర్లు

గోదావరిఖని, డిసెంబర్ 16(ఆంధ్రజ్యోతి): మందమర్రి డివిజన్ పరిధిలోని ఏరియా వర్క్‌షాప్‌లో కన్వేయన్స్ డ్రైవర్‌ గా పనిచేస్తున్న సంతోష్‌ను టెండర్ మారిందనే కారణంతో విధుల నుంచి తొలగించడం సరైంది కాదని వెంటనే విధు ల్లోకి తీసుకోవాలని ఆర్జీ-1 డ్రైవర్స్ అసోసియేషన్ అధ్యక్షు డు ఇండ్ల ఓదెలు కోరారు. సోమవారం స్థానిక ఆర్జీ-1 జీఎం కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. టెండర్ మారిందనే నెపంతో విధుల నుంచి తొలగించడాన్ని తీవ్రంగా ఖండించారు.గత ఆరు సంవత్సరాల నుంచి సంస్థలో ఎంతో నమ్మకంతో పనిచేస్తున్న కార్మికులని ఎలా తొలగిస్తారని అధికారులను వారు ప్రశ్నించారు. కంపెనీ పరం గా డ్రైవర్‌కు ఉండాల్సిన మెడికల్, వీటీసీ, సీఎం పీఎఫ్ నంబర్ తదితర నిబంధనల ప్రకారంగా పనిచేస్తున్న డ్రైవర్‌ను ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఇవ్వకుండా అకారణంగా తొలగించ డం ఆ కుటుంబాన్ని రోడ్డు పాలు చేయడమేనని పేర్కొన్నారు. వెంటనే తొలగించిన డ్రైవర్‌ను విధులల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రమేష్, ములుగు సాగర్, సంపత్, ప్రణీత్, సాగర్, శ్రావణ్, ప్రసాద్, సాయి, అంజి, శివ తదితరులు పాల్గొన్నారు.

ఉత్పత్తిపై అవగాహన



మాట్లాడుతున్న ఏపీఏ జీఎం వెంకటేశ్వర్లు

రామగిరి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ ఏపీఏ డివిజన్ పరిధిలోని ఆడ్రియాల లాంగ్‌వాల్ ప్రాజెక్టులో సోమవా రం మల్టీ డిపార్ట్‌మెంటల్ సమావేశం నిర్వహించి ఉత్పత్తి, ఉత్పాదకతపై అవగాహ న సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమా నికి ఏపీఏ జీఎం వెంకటేశ్వర్లు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.

భద్రతతో కూడిన ఉత్పత్తి ని పెంచుతూ వ్యయాన్ని తగ్గించుకోవాలని సూచించారు. అనంతరం నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించే ప్రణాళికపై అధికారులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగా హన కల్పించారు. ఉత్పత్తి సాధించేందుకు అధికారులు, కార్మికుల నుంచి పలు సలహాలు, సూచనలను స్వీకరిం చారు. సమావేశంలో అధికారులు నాగేశ్వర్‌రా వు, బండి సత్యనారాయణ, చంద్రశేఖర్, గుర్రం శ్రీహరి, రమేశ్, మతీన్, రవిచం ద్ర, విక్రమ్, గంగాధర్, కొమురయ్య, సంఘాల నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

సంతకాల సేకరణలో పాల్గొనాలి

జైపూర్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కార్మికులు తమ హక్కుల కోసం ముఖ్యమంత్రికి పంపే సంతకాల సేకరణలో పాల్గొనాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి అన్నారు. ఐకే 1ఏ గనిపై సోమవారం మాట్లాడారు. సొంతింటి, అలవె న్సులపై ఐటీ మాఫీ, మారుపేర్ల మార్పు, సీబీఎస్ఈ సిలబస్‌పై ముఖ్యమంత్రి నెరవేర్చే విధంగా సంతకాల సేకరణ చేపట్టడం జరుగు తుందన్నారు. కార్మికులు పెద్ద ఎత్తున పాలు పంచుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిరికొండ శ్రీనివాస్, గుల్ల బాలాజీ, అంబాల శ్రీనివాస్ పాల్గొన్నారు.